విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 269 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 19 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## యూట్యూబ్ సేవలకు అంతరాయం..

- ప్రపంచవ్యాప్తంగా యూట్యూబ్ సేవలకు అంతరాయం
- భారత్, యూకే, అమెరికాలో సమస్యలు ఎదుర్కొన్న యూజర్లు
- యాప్, వీడియో స్ట్రీమింగ్‌లో ఇబ్బందులంటూ ఫిర్యాదులు
- సమస్యను పరిశీలిస్తున్నామని తెలిపిన యూట్యూబ్
- అంతరాయానికి కారణంపై ఇంకా స్పష్టతనివ్వని సంస్థ

ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా అంతరాయం కలిగింది. బుధవారం ఉదయం భారత్, అమెరికా, యూకే సహా పలు దేశాల్లోని యూజర్లు యూట్యూబ్ యాక్సెస్ చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యాప్‌ను ఓపెన్ చేయగానే "సమ్‌థింగ్ వెంట్ రాంగ్" అనే ఎర్రర్ మెసేజ్ కనిపించడంతో చాలామంది ఆందోళనకు గురయ్యారు.ఆన్‌లైన్ సేవల పనితీరును పర్యవేక్షించే 'డౌన్‌డిటెక్టర్' ప్రకారం అమెరికాలో దాదాపు 3.20 లక్షల మందికి పైగా యూజర్లు ఈ సమస్యపై

- మిగతా2లో

# నౌకాదళం.. మన బలం




**దేశ రక్షణలో నేవీది కీలకపాత్ర**

**సమైక్యతా స్ఫూర్తికి నిదర్శనం ఐఎఫ్ఆర్**

**విశాఖలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**

**71 యుద్ధ నౌకల నుంచి గౌరవ వందనం స్వీకరణ**





దేశ సాగర జలాల భద్రతలోనే కాకుండా విస్తృతమైన సముద్ర రవాణా వ్యవస్థను సురక్షితంగా ఉంచడంలో భారత నేవీ కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. విశాఖ తీరంలో ఇండియన్ నేవీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)లో బుధవారం ఆమె పాల్గొన్నారు. ఐఎన్ఎస్-సుమేధపై ప్రయాణించి 71 యుద్ధనౌకల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్రపతి వెంట గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దంపతులు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి తదితరులు ఉన్నారు. అనంతరం వివిధ దేశాల నేవీ అధికారులు, అతిథులను

- మిగతా2లో




## రూ.29,018 కోట్ల పెట్టుబడులు.. 22,407 మందికి ఉపాధి

- 27 ప్రాజెక్టుల ప్రతిపాదనలకు ఆమోదం
- ముఖ్యమంత్రి అధ్యక్షతన 15వ ఎస్ఐపీబీ సమావేశం
- ఇప్పటివరకు రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు
- వాటిద్వారా 8.58 లక్షల మందికి ఉపాధి

రాష్ట్రంలో రూ.29,018 కోట్ల పెట్టుబడులతో వివిధ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. వాటిద్వారా 22,407 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఐటీ, విద్యుత్, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, మౌలిక

- మిగతా2లో



## మానవ సేవే పరమావధిగా ఇస్కాన్ ప్రయాణం

### కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**మాయాపుర్:** సనాతన ధర్మ విలువలను ప్రపంచ దేశాలకు చేరవేయడంలో ఇస్కాన్ సంస్థ కీలకంగా పనిచేస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. క్షేత్ర స్థాయిలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ మానవ సేవే పరమావధిగా ముందుకు వెళుతోందని కొనియాడారు. పశ్చిమ బెంగాల్‌లో పర్యటిస్తున్న ఆయన.. నదియా జిల్లా మాయాపుర్ లోని ఇస్కాన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకుర్ 152వ జయంత్యుత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాట్లాడుతూ.. తాను ఇక్కడకు ప్రభుత్వ ప్రతినిధిగా రాలేదని.. చైతన్య మహాప్రభు భక్తునిగా

- మిగతా2లో

## క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన నారా లోకేశ్



- క్రైస్తవ సోదర సోదరీమణులకు మంత్రి నారా లోకేశ్ లెంట్ శుభాకాంక్షలు
- 40 రోజుల ఉపవాస ప్రార్థనల పవిత్ర కాలాన్ని పురస్కరించుకుని సందేశం
- యేసు త్యాగాన్ని స్మరించుకునే ఈ కాలం విశ్వాసం, కరుణ నింపాలని ఆకాంక్ష
- సామాజిక మాధ్యమాల్లో లోకేశ్ సందేశానికి మంచి స్పందన

ఆంధ్రప్రదేశ్ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ క్రైస్తవ సోదర సోదరీమణులకు లెంట్ సీజన్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవులు అత్యంత పవిత్రంగా భావించే 40 రోజుల ఉపవాస దీక్షల ప్రారంభం సందర్భంగా ఆయన తన సందేశాన్ని విడుదల చేశారు.ఈ మేరకు లోకేశ్ స్పందిస్తూ.. "లెంట్ పవిత్ర కాలాన్ని పాటిస్తున్న క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ నా హృదయపూర్వక

- మిగతా2లో

## లడ్డూ తయారీలో దేవుడి సొమ్ము దోపిడీపై చర్చ జరగాలి

### శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

'తిరుమల లడ్డూ తయారీకి వాడిన నెయ్యి కల్తీ అయ్యిందని.. పంది కొవ్వు, గొడ్డు కొవ్వు కలిశాయని నిందలు వేసిన చంద్రబాబు.. దేవదేవుడి ప్రసాదం రూపంలో ఎలా దోచుకుంటున్నారో తేలాలి. కిలో రూ.320కి కొనాల్సిన నెయ్యిని, హెరిటేజ్‌తో సంబంధాలున్న ఇందాపూర్ డెయిరీ

- మిగతా2లో



## భారత్, ఈయూ ఒప్పందంతో స్వర్ణ యుగానికి నాంది

**రక్షణ, టెక్నాలజీ రంగాల్లో స్పెయిన్‌తో బంధం మరింత బలోపేతం**

**రెట్టింపు వాణిజ్యానికి భారత్, ఫిన్లాండ్ అంగీకారం**

**7 దేశాల అధినేతలు, ఇద్దరు సీఈవోలతో మోదీ భేటీ**

**ప్రపంచ దేశాల నేతలకు స్వాగతం పలికి, విందు ఇచ్చిన ప్రధాని**



దిల్లీ: భారత్, ఐరోపా కూటమి (ఈయూ) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో (ఎఫ్‌టీఏ) స్వర్ణ యుగానికి నాంది పలికామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత్‌తోపాటు ఈయూలోని దేశాలకు ఇది ఎంతో మేలు చేయనుందని వెల్లడించారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన దేశాధినేతల్లో ఏడుగురితో బుధవారం దిల్లీలో ఆయన సమావేశమయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై

- మిగతా2లో

## రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల..

**37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు**

**ఈ నెల 26న నోటిఫికేషన్ విడుదల చేయనున్న ఈసీ**

**తెలంగాణ నుంచి 2 సీట్లకు..**

దిల్లీ: వచ్చే ఏప్రిల్‌లో ఖాళీ కానున్న 37 రాజ్యసభ స్థానాలను భర్తీ చేసేందుకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ద్వైవార్షిక ఎన్నికల కోసం ఎన్నికల సంఘం (ఈసీ) బుధవారం షెడ్యూలు ప్రకటించింది. ఈ నెల 26న సంబంధిత ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని.. వచ్చే నెల 16న పోలింగ్ నిర్వహించి,

- మిగతా2లో




## ఏఐ ఎక్స్‌పోలో చైనా రోబో వివాదం

**వెంటనే స్టాల్‌ను ఖాళీ చేయించిన ప్రభుత్వం**

**దేశ ప్రతిష్ఠను దెబ్బతీశారన్న రాహుల్ గాంధీ**

దిల్లీ: దేశ రాజధానిలో జరుగుతున్న అంతర్జాతీయ ఏఐ ఎక్స్‌పోలో ఓ ప్రైవేటు విశ్వవిద్యాలయం చేసిన తప్పిదం తీవ్ర వివాదానికి దారి తీసింది. చైనాలో తయారైన ఓ రోబో డాగ్‌ను తామే తయారు చేశామని ఆ విశ్వవిద్యాలయ ప్రతినిధి ప్రకటించడం వివాదానికి కారణమైంది. వెంటనే స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌పో నుంచి ఆ విశ్వవిద్యాలయ స్టాల్‌ను తొలగించింది. నొయిడాకు చెందిన గల్గోటియాస్ వర్సిటీ ఏఐ ఎక్స్‌పోలో ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. అందులో ఒక రోబో

- మిగతా2లో



# నౌకాదళం.. మన బలం

-మొదటిపేజీ తరువాయి

ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడారు. "దేశాల మధ్య సుహృద్భావ వాతావరణాన్ని పెంపొందించడంలో, ఇతర దేశాల నౌకా దళాలతో భాగస్వామ్యాలు నెలకొల్పడంలో భారత నేవీ కీలక పాత్ర పోషిస్తోంది. భారత్, మిత్ర దేశాల మధ్య ఉన్న ఐకమత్యం, నమ్మకం, పరస్పర గౌరవానికి ఐఎఫ్ఆర్ ఓ నిదర్శనం. తీరం వెంబడి వివిధ దేశాల జెండాలు, నౌకాదళ సిబ్బందితో ఉన్న ఈ యుద్ధ నౌకలను చూస్తుంటే సంతోషంగా ఉంది. ఈ వాతావరణం ఉమ్మడి ఏకాత్మ భావనను ప్రతిబింబిస్తోంది. ఫ్లీట్ రివ్యూలో పాల్గొనడం ద్వారా మన సంబంధాలు మరింత బలోపేతమయ్యాయి. సముద్రాల ద్వారా అందరం కలసికట్టుగా ఉన్నామని ఈ కార్యక్రమం నిరూపించింది. భారత ప్రభుత్వ విధానమైన 'మహాసాగర్' స్ఫూర్తిని ఐఎఫ్ఆర్ మరింత ముందుకు తీసుకెళుతుందని ఆశిస్తున్నా" అని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఐఎన్ఎస్ సుమేధలో ప్రయాణిస్తూ యుద్ధ నౌకల గౌరవ వందనాన్నిస్వీకరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్‌కుమార్ త్రిపాఠి, సీఎం చంద్రబాబు

**సముద్రాలతో భారత్‌ది సుదీర్ఘ బంధం**

సముద్రాలతో భారత్‌ది సుదీర్ఘమైన, లోతైన, శతాబ్దాల నాటి బంధమని రాష్ట్రపతి గుర్తుచేశారు. వ్యాపారానికి, దేశాల మధ్య బంధానికి సముద్ర జలాలు మార్గాలని పేర్కొన్నారు. "కళింగ రాజుల పాలనలో ఒడిశా నుంచి నావికులు దక్షిణాసియా దేశాలకు వెళ్లి వ్యాపారాలు చేసేవారు. వారి రాకపోకలను అప్పటి ప్రజలు పండగలా జరుపుకొనేవారు. ఆనాటి సంప్రదాయానికి గుర్తుగా ఏటా కార్తిక పౌర్ణమి నుంచి వారం పాటు ఒడిశాలోని కటక్ ప్రాంత ప్రజలు బాలి జాతర అనే పండగను జరుపుకొంటున్నారు. ప్రస్తుతం ఫ్లీట్ రివ్యూ జరుగుతున్న విశాఖపట్నం.. భారత తూర్పు నౌకా దళ (ఈఎన్‌సీ) కేంద్రం. ఈ నగరానికీ సముద్ర వర్తక చరిత్రలో కీలక స్థానం ఉంది. ఇక్కడ ఐఎఫ్ఆర్‌ను నిర్వహించడం.. ఈ నగరానికి నేవీ ఇస్తున్న ప్రాధాన్యాన్ని నొక్కి చెబుతోంది' అని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రపంచ పురోగతి, శ్రేయస్సుకు మార్గాలుగా ఉన్న మహాసముద్రాలను అభివృద్ధి చేయడానికి ఆయా దేశాల నౌకాదళాలు సమష్టిగా సహకరిస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న విదేశీ నౌకాదళాల అధికారులు, సిబ్బందిని దేశ ప్రజల తరఫున ప్రశంసించారు.

# రూ.29,018 కోట్ల పెట్టుబడులు.. 22,407 మందికి ఉపాధి

-మొదటిపేజీ తరువాయి

సదుపాయాల రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు 27 సంస్థల నుంచి అందిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన 15వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, పి.నారాయణ, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్‌రెడ్డి, దుర్గేష్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'ప్రతిష్ఠాత్మక గూగుల్, అర్సెలార్ మిత్తల్, బీపీసీఎల్ లాంటి మెగా ప్రాజెక్టులు వరుసగా ఏర్పాటుకావాలి. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి అడ్డంకులు లేకుండా చూడాలి. భూములు కేటాయించినా నిర్ణీత వ్యవధిలో పనులు ప్రారంభించని సంస్థలతో సంప్రదింపులు జరపాలి. ప్రాజెక్టు నిర్మాణానికి ఆసక్తి లేదంటే భూములు వెనక్కి తీసుకోవాలి. ప్రతి ఒప్పందం వేగంగా అమలుకావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టులు త్వరితగతిన కార్యరూపంలోకి తేవాలి' అని అధికారులకు సీఎం సూచించారు. ఇప్పటివరకు 15 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.9,03,726 కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని.. వాటిద్వారా 8,58,082 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం పేర్కొన్నారు.

**సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు**

సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు సీఎం ప్రకటించారు. 'సొంత భూముల్లో ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకునేవారికీ అదనపు ప్రోత్సాహకాలు అందించే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎన్నారైలను ఆహ్వానించాలి' అని సూచించారు.

**విశాఖలో ఐకానిక్‌గా 'భారత్ మండపం'**

విశాఖపట్నంలో 'భారత్ మండపం' రాబోతోందని.. దాన్ని ఐకానిక్‌గా తీర్చిదిద్దేలా చూడాలని అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. దేశంలోనే అత్యుత్తమ కన్వెన్షన్ సెంటర్‌గా నిలవాలన్నారు. 'ప్రతి జిల్లాలో శిల్పారామాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. కాకినాడ, ఏలూరు లాంటి ప్రాంతాలతో సహా.. రాష్ట్రంలో మరిన్ని హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లు రావాలి. విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లుగా పర్యాటకరంగాన్ని ప్రోత్సహించాలి. సూర్యలంక, పోలవరం, పులికాట్, గండికోట, శ్రీశైలం, మదనపల్లె హార్స్‌లీ హిల్స్ లాంటి క్లస్టర్లు ఏర్పాటుచేసి.. అక్కడ షాపింగ్ మాల్స్, హోటళ్లు ఏర్పాటుచేస్తే పర్యాటకుల్ని ఆకట్టుకోవచ్చు. క్రీడా నగరం, క్రియేటివ్ సిటీ ఎకో సిస్టం లాంటివి నెలకొల్పాలి. హెల్త్ టూరిజం గణనీయంగా పెరగాలి. హాస్పిటాలిటీలో డీమ్డ్ యూనివర్సిటీ లాంటివాటిని ప్రోత్సహించాలి. ఆక్వా రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తులు వస్తేనే అమెరికాకు ఎగుమతులు పెరిగే అవకాశం ఉంటుంది. డెయిరీ, పౌల్ట్రీ, లైవ్‌స్టాక్, మాంసం ఎగుమతులు పెరిగేలా చూడాలి' అని పేర్కొన్నారు..

**ఉద్యోగాల వివరాలతో నైపుణ్యం పోర్టల్**

రాష్ట్రంలో ఇప్పటివరకు యువతకు లభించిన ఉపాధి వివరాలను నైపుణ్యం పోర్టల్‌తో అనుసంధానించాలని సీఎం సూచించారు. 'ఇంకా ఎన్ని ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయనే వివరాలు తెలిసేలా రియల్ టైంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. ఎస్ఐపీబీ ఆమోదం తెలిపినవి, విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలకు సంబంధించి కార్యకలాపాలు ప్రారంభించే తేదీని స్పష్టంగా పేర్కొనాలి. విజయవాడ, విశాఖ, తిరుపతిల్లో ఈవీ ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు కార్యాచరణ చేపట్టాలి' అని అధికారులకు సూచించారు.

తిరుపతి జిల్లాలో హెరిటేజ్ ఫుడ్స్ అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు సమావేశం నుంచి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ బయటకు వెళ్లిపోయారు. ఆ ప్రతిపాదనపై చర్చించి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దానికి ఆమోదం తెలిపారు.

# భారత్, ఈయూ ఒప్పందంతో స్వర్ణ యుగానికి నాంది

-మొదటిపేజీ తరువాయి

వారితో చర్చించారు. ఇద్దరు సీఈవోలతోనూ మోదీ భేటీ అయ్యారు. 'స్పెయిన్ ప్రభుత్వాధినేత పెడ్రో శాంచెజ్‌తో ఫలవంతమైన చర్చలు జరిగాయి. భారత్, స్పెయిన్ స్నేహానికి మరింత ఊతమిచ్చేలా ఈ చర్చలు సాగాయి. రక్షణ, భద్రత, టెక్నాలజీ రంగాల్లో సహకారంపై చర్చించాం. 2026ను భారత్-స్పెయిన్ సాంస్కృతిక, పర్యాటక, ఏఐ సంవత్సరంగా గుర్తిస్తున్నాం. ఎఫ్‌టీఏవల్ల స్పెయిన్‌తో ఆర్థిక బంధం మరింత బలపడనుంది. రెండు దేశాల ప్రజలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

'ఏఐ సమిట్‌ను ఏర్పాటు చేసిన ప్రధాని మోదీకి శుభాకాంక్షలు' అని శాంచెజ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

భారత్, స్పెయిన్ సంబంధాలు, వాణిజ్యం, పెట్టుబడులు, టెక్నాలజీ, మౌలిక వసతులు, వాతావరణం, పునరుత్పాదక ఇంధన వనరులు, రక్షణ, భద్రత, అంతరిక్షం, సంస్కృతి, పర్యాటకం, ప్రజల మధ్య సంబంధాలపై ఇద్దరు నేతలూ చర్చలు జరిపారు.

దిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ ఉసిక్

రూపాంతరీకరణ శక్తిగా ఏఐ ఎదుగుతోందని వారు అభిప్రాయపడ్డారు

ఎఫ్‌టీఏకు మద్దతుగా నిలిచినందుకు ఫిన్లాండ్ ప్రధాని పెటెరి ఆర్పోకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. రెండు దేశాల మధ్య వాణిజ్యాన్ని రెట్టింపు చేసుకోవాలని భేటీ సందర్భంగా ఇద్దరు నేతలు నిర్ణయించారు. 6జీ, ఆవిష్కరణలు, శుద్ధ ఇంధనం, బయో ఇంధనాలు, సర్క్యులర్ ఆర్థిక వ్యవస్థలపై వారి మధ్య చర్చలు జరిగాయి. రక్షణ, తయారీ, ఎరువులు, మౌలిక వసతుల రంగాల్లో మరింతగా సహకరించుకోవాలని ప్రధాని మోదీ, సెర్బియా అధ్యక్షుడు ఉసిక్ నిర్ణయించారు. భారత్ తమకు విశ్వసనీయ భాగస్వామి అని ఉసిక్ వెల్లడించారు.

క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెంకోవిక్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. టెక్నాలజీ, ఆవిష్కరణలు, నౌకా నిర్మాణం, బ్లూ ఎకానమీ వంటి రంగాల్లో పరస్పర సహకారంపై వారు చర్చించుకున్నారు. లాజిస్టిక్స్, జల రవాణా, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్, రక్షణ వంటి రంగాల్లో సహకారానికి ఎదురు చూస్తున్నామని ప్లెంకోవిక్ వెల్లడించారు. ఎస్తోనియా అధ్యక్షుడు అలార్ కరిస్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. టెక్నాలజీలు, ఇంధన నిర్వహణ, నైపుణ్య రంగాల్లో కలిసి పని చేయాలని నిర్ణయించారు. కజకిస్థాన్‌తో వాణిజ్యం, ఇంధనం, కీలక ఖనిజాలు, రక్షణ రంగాల్లో సహకారానికి మరిన్ని అవకాశాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆ దేశ ప్రధాని ఓల్జాస్ బెక్తెనోవ్‌తో ఆయన సమావేశమయ్యారు. పరస్పర విశ్వాసం, గుడ్‌విల్ ఆధారంగా భారత్, భూటాన్ బంధం కొనసాగుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భూటాన్ ప్రధాని షెరింగ్ తాబ్గేతో ఆయన భేటీ అయ్యారు.

గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, సన్ మైక్రో సిస్టమ్స్ సహ వ్యవస్థాపకుడు వినోద్ ఖోస్లాలతోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు.

**ప్రపంచ నేతలకు స్వాగతం**

ఏఐ ఇంపాక్ట్ సమిట్ జరిగే భారత మండపంవద్ద ప్రపంచ దేశాల నేతలకు ప్రధాని మోదీ బుధవారం సాయంత్రం ఘనంగా స్వాగతం పలికారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్, ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టాలినా జార్జీవా, మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులాం, క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెంకోవిక్, సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ ఉసిక్, సీషెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిళ్లై, ఎస్తోనియా అధ్యక్షుడు అలార్ కరిస్, ఫిన్లాండ్ ప్రధాని పెటెరి ఆర్పో, శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే, గ్రీస్ ప్రధాని కిరియాంకో మిసోటకిస్, గయానా ఉపాధ్యక్షుడు భరత్ జగ్దేవ్, భూటాన్ ప్రధాని షెరింగ్ తాబ్గేలను ఆయన స్వాగతించారు. డ్రమ్స్, నాదస్వరం, తంబూరాల వంటి సంప్రదాయ సంగీత ధ్వనుల మధ్య వారికి ఘనంగా స్వాగతం లభించింది. ప్రతి ఒక్కరితో మోదీ కరచాలనం చేశారు.

**నేడు ఏఐ సమిట్‌కు శ్రీకారం**

ఏఐ ఇంపాక్ట్ సమిట్‌ను గురువారం ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. భారత్ మండపంలో జరిగే ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తారు. ఆ తర్వాత సీఈవోలతో చర్చలో భాగస్వాములవుతారు. ప్రారంభ కార్యక్రమంలో మోదీతోపాటు ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ప్రసంగిస్తారు.

# లడ్డూ తయారీలో దేవుడి సొమ్ము దోపిడీపై చర్చ జరగాలి

-మొదటిపేజీ తరువాయి

ద్వారా రూ.700కి సరఫరా చేస్తూ ఎలా దోచుకు తింటున్నారో తెలియాలి. ఈ అంశంపై మండలిలో చర్చ జరగాలి. జరిగిన మోసమేంటో ప్రజలకు తెలియాలి' అని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. 'ఇందాపూర్ డెయిరీతో హెరిటేజ్ సంస్థ చీకటి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ రెండు సంస్థలకు ఉన్న అనుబంధంపై ప్రశ్నిస్తే తితిదేతో వివరణ ఇప్పించారు. దానికి బదులు సభలోనే చర్చించొచ్చు కదా? ప్రభుత్వంలో ఉన్నవారు ఇలాంటి తప్పులు చేస్తే.. అధికారంలో కొనసాగే హక్కు ఉందా? కూటమి ప్రభుత్వానికి ఒక్కరోజూ అధికారంలో కొనసాగే హక్కు లేదు' అని బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు.రెడ్, ఎల్లో కాదు... బ్లూ బుక్: 'మంత్రి లోకేశ్ మీద నాకు ప్రేమ, కోపం లేవు. ఆయన ఇప్పుడిప్పుడే రాజకీయాల్లో ఎదుగుతున్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్, ఎల్లో బుక్ కాకుండా బ్లూ బుక్ రాజ్యాంగం నడిస్తే బాగుంటుంది' అని బొత్స సత్యనారాయణ అన్నారు. కాపులను బీసీల్లో చేర్చాలనే అంశంపై శాసనమండలిలో తొలుత ప్రశ్న వేసిన జనసేన ఎమ్మెల్సీ నాగబాబు.. తర్వాత ఎందుకు ఆ ప్రశ్నను ఉపసంహరించుకున్నారని ప్రశ్నించారు.

**వాళ్లు మా పార్టీలో లేరు**

వైకాపా నాయకులకు ఒక స్టాండ్ లేదా? మండలిలో వైకాపా రెండు రకాల తీర్మానాలు ప్రవేశపెట్టిందేమని ఒక విలేకరి అడిగిన ప్రశ్నపై బొత్స స్పందిస్తూ మర్రి రాజశేఖర్, బల్లి కల్యాణ చక్రవర్తి తమ పార్టీలో లేరని, తెదేపాలో చేరారని సెల్‌ఫోన్‌లో ఫొటో చూపించారు. వాళ్ల తీర్మానంతో తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు.

'లడ్డూ విషయంలో చంద్రబాబు దేవుడ్ని, ప్రజలను మోసం చేశారు. తప్పులు వాళ్లు చేసి వైకాపాపై బురద జల్లారు. లడ్డూకు వాడే నెయ్యిపై వాయిదా తీర్మానం ఇస్తే చర్చించడానికి ఎందుకు భయపడుతున్నారు?' అని వైకాపా ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వరుదు కల్యాణి, కల్పలతారెడ్డి, తోట త్రిమూర్తులు ప్రశ్నించారు.

## మానవ సేవే పరమావధిగా ఇస్కాన్ ప్రయాణం

-మొదటిపేజీ తరువాయి

వచ్చానని పేర్కొన్నారు. "దేశంలో పర్యటిస్తున్నప్పుడు ఇస్కాన్ ప్రభావాన్ని గమనించాను. మీరు ప్రచురించిన భగవద్గీత అన్ని వయసుల వారికి, అన్ని వర్గాల వారికీ అక్కరకు వస్తోంది. అయితే భక్తి దగ్గరే ఇస్కాన్ ఆగిపోలేదు. ఎక్కడైనా విపత్తు తలెత్తితే అక్కడకు వెళ్లి చేయందించే మొట్టమొదటి సంస్థగా నిలుస్తోంది. ఆహార పంపిణీ శిబిరాలు ఏర్పాటు, విద్య, వైద్య రంగాలను పేదవారికి చేరువ చేయడానికి అనేక కార్యక్రమాలను చేపడుతోంది' అని అమిత్ షా కొనియాడారు.

## యూట్యూబ్ సేవలకు అంతరాయం..

-మొదటిపేజీ తరువాయి

ఫిర్యాదు చేశారు. వీరిలో 74 శాతం మందికి యాప్‌లో సమస్యలు తలెత్తగా, 16 శాతం మందికి వీడియో స్ట్రీమింగ్‌లో ఇబ్బందులు ఎదురైనట్లు తేలింది. ఉదయం 6:30 నుంచి 7:30 గంటల మధ్యలో దాదాపు 20,000 ఫిర్యాదులు నమోదయ్యాయి.

ఈ అంతరాయంపై సోషల్ మీడియా వేదికగా యూజర్లు పెద్ద ఎత్తున స్పందించారు. తమ ఫోన్లలో, టీవీలలో లాగిన్ అవ్వలేకపోతున్నామని, ఖాతాలు మార్చుకోలేకపోతున్నామని కొందరు పేర్కొన్నారు. మరికొందరు తమకు యూట్యూబ్ పేజీ మొత్తం ఖాళీగా కనిపిస్తోందని, కేవలం సైడ్‌బార్ మాత్రమే పనిచేస్తోందని స్క్రీన్‌షాట్లను షేర్ చేశారు.

ప్రపంచవ్యాప్తంగా ఫిర్యాదులు వెల్లువెత్తడంతో యూట్యూబ్ స్పందించింది. "ఈ సమస్య మా దృష్టికి వచ్చింది. దీనిని పరిశీలిస్తున్నాము. పరిష్కారం ఇంకా లభించనప్పటికీ, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాము. తదుపరి అప్‌డేట్‌లను తెలియజేస్తాం" అని ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే, ఈ సాంకేతిక లోపానికి గల కారణాలను గానీ, సేవలు ఎప్పుడు పూర్తిగా పునరుద్ధరించబడతాయన్నది గానీ యూట్యూబ్ ఇంకా వెల్లడించలేదు.

## క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన నారా లోకేశ్

-మొదటిపేజీ తరువాయి

శుభాకాంక్షలు. యేసు క్రీస్తు జీవితం, త్యాగాలను స్మరించుకుంటూ 40 రోజుల పాటు ఉపవాసం, ప్రార్థన, ధ్యానంతో గడిపే ఈ పవిత్రమైన సమయం ప్రతి ఒక్కరిలో విశ్వాసాన్ని, కరుణను, ఆశను పునరుద్ధరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ తన సందేశాన్ని ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. ఆయన పోస్ట్‌పై క్రైస్తవ సంఘాల నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. పలువురు నెటిజన్లు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

## ఏఐ ఎక్స్‌పోలో చైనా రోబో వివాదం

-మొదటిపేజీ తరువాయి

డాగ్‌ను ప్రదర్శించింది. దీనిపై ఆ వర్సిటీ కమ్యూనికేషన్స్ ప్రొఫెసర్ నేహా సింగ్ డీడీ న్యూస్‌తో మంగళవారం మాట్లాడారు. ఆ రోబోను తమ వర్సిటీకి చెందిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ తయారు చేసిందని వివరించారు. ఈ వీడియో వైరల్ కావడంతో సోషల్ మీడియాలో ఆ రోబో అసలు విషయాన్ని బయటపెట్టారు. అది యూనిట్రీ గో-2 రోబో అని, చైనాలోని యూనిట్రీ తయారు చేసిందని వెల్లడించారు. దీంతో వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆ వర్సిటీ స్టాల్‌ను ఖాళీ చేయించింది. మరోవైపు వర్సిటీ యాజమాన్యం క్షమాపణలు చెప్పింది. ఆ రోబో డాగ్ సాంకేతిక మూలాల గురించి తమ ప్రతినిధికి తెలియదని, కెమెరా ముందు అత్యుత్సాహంతో తప్పుడు సమాచారాన్ని అందించారని ఓ ప్రకటనలో తెలిపింది. ఏఐ సమిట్‌లో చైనా వస్తువులను ప్రదర్శించి దేశ ప్రతిష్ఠను దెబ్బతీశారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన ఒక ప్రచార ఆర్భాటంగా ఏఐ సదస్సును ఆయన అభివర్ణించారు.

## రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల..

-మొదటిపేజీ తరువాయి

అదే రోజు ఓట్ల లెక్కింపు చేపడతామని తెలిపింది.

10 రాష్ట్రాలకు చెందిన ఈ 37 రాజ్యసభ స్థానాలు ఏప్రిల్ 2, 9 తేదీలతో ఖాళీ కానున్న సంగతి గమనార్హం. వీటిలో అత్యధికంగా మహారాష్ట్ర నుంచి ఏడు సీట్లు ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో తమిళనాడు (6), పశ్చిమ బెంగాల్ (5), బిహార్ (5), ఒడిశా (4), అస్సాం (3), తెలంగాణ (2), ఛత్తీస్‌గఢ్ (2), హరియాణా (2), హిమాచల్ ప్రదేశ్ (1) ఉన్నాయి. ఏప్రిల్‌లో పదవీకాలం ముగియనున్న ప్రముఖ నేతల్లో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ (జేడీయూ), శరద్ పవార్ (ఎన్‌సీపీ-ఎస్పీ), రాందాస్ అఠవాలే (ఆర్‌పీఐ-ఏ), తిరుచ్చి శివ (డీఎంకే) తదితరులు ఉన్నారు. తెలంగాణ నుంచి ఎగువ సభకు ఎన్నికైన అభిషేక్ సింఘ్వీ (కాంగ్రెస్), కె.ఆర్.సురేశ్ రెడ్డి (భారాస) పదవీకాలం ఏప్రిల్ 9తో పూర్తికానుంది. ప్రస్తుతం మహారాష్ట్ర, ఒడిశా, బిహార్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, అస్సాంలలో భాజపా సొంతంగానో, పాలక సంకీర్ణంలో మిత్రపక్షంగానో అధికారంలో ఉంది. ఎగువ సభలో పార్టీ బలం పెరిగేందుకు ఇది దోహదపడనుంది. ఏప్రిల్‌లో 9 మంది భాజపా ఎంపీలు పదవీ విరమణ చేయనున్నారు. రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీ 15-18 స్థానాలు గెల్చుకునే అవకాశాలు ఉన్నాయి. హిమాచల్, తమిళనాడు, తెలంగాణ, బెంగాల్‌లలో విపక్ష పార్టీల ప్రభుత్వాలు ఉన్నాయి.

**బెంగాల్ నుంచి ప్రాతినిధ్యం కోల్పోనున్న వామపక్షాలు**

బెంగాల్‌లో ఎన్నికలు జరగనున్న ఐదు రాజ్యసభ స్థానాల్లో నాలుగింటిని దక్కించుకునే బలం తృణమూల్ కాంగ్రెస్‌కు ఉంది. మిగిలిన ఒక్క స్థానం భాజపా ఖాతాలో పడొచ్చు. బెంగాల్‌ను 2011 వరకు వరుసగా మూడు దశాబ్దాలు పాలించిన వామపక్షాలు.. రాష్ట్రం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యాన్ని తొలిసారిగా ఈ ఎన్నికలతో పూర్తిగా కోల్పోనున్నాయి. సీపీఎం నేతృత్వంలోని వామపక్ష కూటమికి బెంగాల్‌లో ప్రస్తుతం లోక్‌సభ సభ్యులు కూడా లేరు. అసెంబ్లీలోనూ కూటమికి ప్రాతినిధ్యం లేకపోవడం గమనార్హం.

# అసెంబ్లీ ఆవరణలో చేనేత స్టాళ్లు.





- ఆప్కో ఆధ్వర్యంలో 12 చేనేత స్టాళ్లు ప్రారంభం.
- బడ్జెట్ సమావేశాల ముగిసే వరకూ స్టాళ్ల నిర్వహణ.
- స్టాళ్ల ద్వారా ప్రఖ్యాత గాంచిన చేనేత వస్త్రాల విక్రయం.
- అమ్మకానికి పొందూరు షర్ట్ లు పంచెలు, కండువాలు.
- మాధవవరం, వెంకటగిరి, ధర్మవరం, రాజమండ్రి, బందరు పట్టు చీరలు విక్రయం
- చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచడమే లక్ష్యం మంత్రి సవిత.

**అమరావతి, పెన్ సత్తా, పిబ్రవరి 18:** కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యంగా చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా ఎగ్జిబిషన్లు, బజార్లు, వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటోంది. పండగ సమయాల్లో భారీ డిస్కౌంట్లు అందజేస్తూ చేనేత వస్త్రాల వినియోగం పెంచడంతో పాటు నేతన్నలకు ఏడాది పాటు ఉపాధి కల్పించడమే కాకుండా ఆదాయం ఆర్జించేలా చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో చేనేత స్టాళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో అసెంబ్లీకి, శాసనమండలికి వస్తున్నారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచే లక్ష్యంతో నేటి (గురువారం) నుంచి బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకూ ఆప్కో ఆధ్వర్యంలో 12 స్టాళ్లను చేనేత, జౌళి శాఖాధికారులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తయారవుతున్న ప్రఖ్యాత గాంచిన చేనేత ఉత్పత్తులను ఈ స్టాళ్లలో విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారు. పొందూరు షర్ట్ లు, పంచెలు, కండువాలు, మాధవవరం, వెంకటగిరి, ధర్మవరం, రాజమండ్రి, ఉప్పాడ, బందరు, మానపల్లి పట్టు, సాధారణ చీరలతో పాటు ఇంటిల్లపాది వినియోగించు కునే రెడీమేడ్ దుస్తులను ఈ స్టాళ్లలో అమ్మకానికి అందుబాటులో ఉంచనున్నారు. లుంగీలు, టవళ్లు, దుప్పట్లు, ఇతర చేనేత వస్త్రాలను సైతం అమ్మకానికి పెట్టనున్నారు. గురువారం ఈ స్టాళ్లను ప్రారంభించి, అమ్మకాలు ప్రారంభించనున్నారు. అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత బుధవారం పరిశీలించారు. ఏయే వస్త్రాలు విక్రయిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే ప్రపంచ ప్రఖ్యాతగాంచిన చేనేత వస్త్రాలను, పట్టు చీరలను అమ్మకానికి పెట్టాలని చేనేత, జౌళి శాఖాధికారులకు మంత్రి సవిత ఆదేశించారు. చేనేత స్టాళ్లతో పాటు ఫొటో స్టాల్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. చేనేత దుస్తుల వినియోగం పెంచేలా సీఎం చంద్రబాబు నాయుడు దంపతులు, మంత్రి నారా లోకేశ్ దంపతులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహా పలువురు ప్రముఖులు చేనేత ఎగ్జిబిషన్లు సందర్శన చేసి చేనేత వస్త్రాల కొనుగోలు చేసిన, ధరించిన దృశ్యాలను ఈ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశారు. నేతన్నలతో సీఎం చంద్రబాబు నాయుడు సంభాషిస్తున్న దృశ్యాలు కూడా ఎగ్జిబిషన్లో ప్రదర్శనకు పెట్టారు. చేనేత అమ్మకాలు పెంచడమే లక్ష్యం మంత్రి సవిత. నేతన్నలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించడంతో పాటు ఆర్థికవృద్ధి కలిగించడమే సీఎం చంద్రబాబు నాయుడు ధ్యేయమని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి చేనేత వస్త్రాల అమ్మకం, వినియోగం పెంచేలా చేనేత ఎగ్జిబిషన్లు, బజార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏ చిన్న వేడుకగాని, పండుగాని వచ్చినా ప్రత్యేక డిస్కౌంట్లతో చేనేత దుస్తుల అమ్మకాలు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఆప్కో ఆధ్వర్యంలో 12 చేనేత స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా గురువారం నుంచి వచ్చే నెల ఏడో తేదీ వరకూ ఈ స్టాళ్లు నిర్వహిస్తామన్నారు. చేనేత దుస్తుల వినియోగం పెంచడమే లక్ష్యంగా ఈ స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బడ్జెట్ సమావేశాలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కూటమి నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో వస్తుంటారన్నారు. వారంతా చేనేత వస్త్రాలు కొనుగోలు చేయడం ద్వారా, నేతన్నలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ప్రజలంతా వారంలో ఒకరోజు చేనేత దుస్తులు ధరించడం ద్వారా సంప్రదాయ మైన చేనేత వృత్తికి వెన్నుదన్నుగా నిలిచేవారవుతారని మంత్రి సవిత తెలిపారు.



# పేదలకు అండ ముఖ్యమంత్రి సహాయ నిధి యార్లగడ్డ





**గన్నవరం, పెన్ సత్తా, పిబ్రవరి 18:**రాష్ట్రంలో ఆర్థిక స్తోమత లేని కారణంగా ఏ ఒక్క పేదవాడు కూడా వైద్యం అందక ఇబ్బంది పడకూడదనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమని గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం విజయవాడ లోని తన కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గం లోని నిరుపేదలు అనారోగ్యం బారిన పడి కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న తరుణంలో, వారికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవాలనే ఉద్దేశంతో ఆయన ఈ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన కొల్లి గంగరాజుకు 75,000 రూపాయలు, అలాగే గన్నవరం మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన బానవత్తు పుణ్యవతికి 2,01,460 రూపాయల విలువైన ఎల్.ఓ.సి పత్రాలను యార్లగడ్డ వెంకట్రావు స్వయంగా అందజేశారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వీరు వైద్య ఖర్చులు భరించలేని స్థితిలో ఉండటంతో, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వం నుండి ఈ నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్క పేదవాడు కూడా మెరుగైన వైద్యానికి దూరం కాకూడదన్నదే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. బాధితుల దరఖాస్తులను పరిశీలించి, వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేయించడం ద్వారా వారికి సకాలంలో చికిత్స అందేలా చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆపద సమయంలో ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధులు అండగా ఉంటారనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేలా తమ కార్యకలాపాలు సాగుతున్నాయని వివరించారు. కష్టకాలంలో తమ విన్నపానికి స్పందించి, వెన్నంటి నిలిచినందుకు ఎమ్మెల్యేకు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఘనంగా సీఎం రమేష్ జన్మదిన వేడుకలు







**పరవాడ, పెన్ సత్తా, ఫిబ్రవరి 18:** అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ పుట్టినరోజు వేడుకలను పరవాడలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. బీజేపీ నాయకుడు కూండ్రపు సోము నాయుడు ఆధ్వర్యంలో పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేసారు. అలాగే కొండకర్లలో ఇచ్ఛా ఫౌండేషన్ లోని దివ్యాంగులకు మధ్యాహ్న భోజనం వితరణ చేశారు.

ఈ సందర్భంగా సోము నాయుడు మాట్లాడుతూ సీఎం రమేష్ సేవా భావం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజాసేవే పరమావధిగా తీసుకుని ఆయన అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు.
రైల్వే రంగంలో మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త ప్రాజెక్టుల ఆమోదం, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని కొనియాడారు. జన్మదినాన్ని సేవా దినోత్సవంగా నిర్వహించడం ద్వారా సమాజానికి స్ఫూర్తి చేకూర్చే సందేశం అందించామని బీజేపీ కార్యకర్తలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారు రాజశేఖర్, బండారు రాజు, బండారు అజయ్, చుక్క గోపి, సిరిపురపు రాజేష్, గండి శ్రీను, సుజన్, దిలీప్, రాజాన రాజు, కుమార్ రాజా, ధనుంజయ్, రమణ, నాని తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రెవెన్యూ క్లినిక్ లో వచ్చిన అర్జీల పై విచారణ చేసి సత్వరమే పరిష్కరించాలి

- రెవెన్యూ పరిపాలనలో పారదర్శకత, సమయపాలనకే ప్రాధాన్యం.
- జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 18:** రెవెన్యూ క్లినిక్ లో వచ్చిన అర్జీల పై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సత్వరమే పరిష్కరించాలని, రెవెన్యూ సేవలలో సమయపాలన, పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలనను కట్టు దిట్టం చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ డి.ఆర్వో, ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం ఉదయం కలక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రెవెన్యూ, సర్వే, భూమి రికార్డులు, పౌర సరఫరాల శాఖల పై మండల, డివిజన్ ల వారిగా గ్రామ వార్డు సచివాలయల సర్వీస్ లు, రెవెన్యూ క్లినిక్, పి జి ఆర్ ఎస్ లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు ప్రతి రోజు క్షేత స్థాయిలో మానిటరింగ్ చేసి, రెవెన్యూ సేవలలో ఆలస్యం లేకుండా ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలన్నారు. జిల్లాలో వివాదరహిత భూ రికార్డులు, బాధ్యతాయుత రెవెన్యూ పరిపాలన కోసం అధికారులు మరింత చురుకుగా పనిచేయాలన్నారు. ఆన్లైన్ సేవలు, భూ వ్యాపింగ్, రికార్డులు అప్డేషన్, మ్యుటేషన్ దరఖాస్తులు వంటి సమస్యల పై కార్యాచరణ ప్రణాళిక తయారుచేసు కొని పరిష్కరించాలన్నారు. లోపాలు ఉన్న చోట వెంటనే సరిదిద్దాలని, నిర్ణీత సమయంలో నివేదికలు సమర్పించాలన్నారు. మండల స్థాయిలో తరుచూ క్షేత్ర స్థాయిలో పర్యటించి విచారణ చేయాలన్నారు. పిజిఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్ లలో ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే విచారణ చేయాలన్నారు. నీటి తీరువ పన్ను వసూలు కోసం ప్రతి మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్, డి.అర్వో., వై.సత్యనారాయణ రావు, ఎన్ ఎ ఓ బి, కె ఆర్ ఆర్ సి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు కె.మనోరమ, ఎస్. సుబ్బలక్ష్మి, అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయిషా, ఎడి సర్వే, జిల్లా పౌర సరఫరాల అధికారి, పౌర సరఫరాల డి.ఎం., డి సి ఎస్ ఓ లు కె.ఎన్.మూర్తి, కె జయంతి, అన్ని మండలాల తహసీల్దార్లు, కలక్టరేట్ పరిపాలన అధికారి, మేజిస్ట్రియల్, కో ఆర్డినేషన్, భూ వ్యవహారాల పర్యవేక్షకులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు.



**గన్నవరం, పెన్ సత్తా, పిబ్రవరి 18:** నియోజకవర్గ కేంద్రం లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సిహెచ్సి) అభివృద్ధి చేయాలని అలానే ఒక ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు శాసనసభలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఆసుపత్రి అభివృద్ధి కోసం తాను ఇప్పటికే కోల్ ఇండియా, హెచ్ సి ఎల్ సంస్థల నుండి రూ. 3 కోట్ల 90 లక్షల సిఎస్ఆర్ నిధులను సేకరించినట్లు ఆయన సభకు వివరించారు. నియోజకవర్గ పరిధిలో ప్రతి సంవత్సరం సగటున 125 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, బాధితులకు తక్షణ ప్రాథమిక చికిత్స అందించడానికి వీలుగా ప్రస్తుతం ఉన్న 30 పడకల ఆసుపత్రిని 50 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని ఆయన కోరారు. గన్నవరంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్నందున, విమాన ప్రయాణి కులకు ఏదైనా ప్రమాదం జరిగినా, అనారోగ్య సమస్యలు తలెత్తినా తక్షణమే చికిత్స అందించే సౌకర్యం ఉండాలని, ప్రస్తుతం వారు విజయవాడ వరకు వెళ్లాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను సొంతంగా సిఎస్ఆర్ నిధులు సేకరించిన నేపథ్యంలో, ఆసుపత్రి లోని మిగిలిన అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని సంబంధిత మంత్రిని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విజ్ఞప్తి చేశారు.

# సీఎం రమేష్ జన్మదిన సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ



**అనకాపల్లి, పెన్ సత్తా, పిబ్రవరి 18:** జిల్లా బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పలక రవి ఆధ్వర్యంలో అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ జన్మదిన సందర్భంగా బుధవారం లెప్పర్స్ కాలనీలో 400 కుటుంబాల లోని మహిళలకు చీరలు, పళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు ద్వారపు రెడ్డి పరమేశ్వర రావు, అనకాపల్లి పార్లమెంట్ ఇంచార్జ్ విజయ్ నాయుడు పాల్గొన్నారు. విజయ రామరాజుపేట గ్రామ పెద్దల సమక్షంలో వినాయక మందిరంలో పూజలు చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కర్రీ రామకృష్ణ, బోడ్డేడ నాగేశ్వరరావు, పోలవరపు త్రినాధ్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటాం

**బాపట్ల శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు**

**బాపట్ల,పెన్ సత్తా,ఫిబ్రవరి 18:**తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరం శ్రమించే కార్యకర్తలే పార్టీకి బలమని,వారి కష్ట సుఖాల్లో తోడుగా ఉండడం తన బాధ్యత అని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు.బాపట్ల మండలం,కొత్త వాడరేవు గ్రామానికి చెందిన టీడీపీ బూత్ ఇంచార్జ్ వారి సుబ్రహ్మణ్యం రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ,ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నాడు.ఈ విషయం తెలుసుకున్న శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు బుధవారం స్వయంగా సుబ్రహ్మణ్యం రెడ్డి నివాసానికి వెళ్లి,అతనిని పలకరించి,ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు.



## 9వ వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాను..

**9వ వార్డు ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు.**



**వలిగొండ మండలం పెన్ సత్తా, పిబ్రవరి 18:**యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని సింగన్నగూడెం లో తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గా విజయం సాధించిన బొంతల నర్సింగ్ మీడియాతో మాట్లాడుతూ.


నా విజయానికి సహకరించిన 9వ వార్డు ఓటర్లు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు.

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ద్వారా 9వ వార్డు లో ఎలాంటి సమస్యలు ఉన్న వార్డు అభివృద్ధికి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానని.

9 వార్డు సభ్యులకు 24 గంటలు అందుబాటులో ఉంటానని మాట్లాడినారు.

ఈ సందర్భంగా మీడియా జిల్లా స్టాపర్ గోలనుకొండ బాలరాజు 9వ వార్డు కౌన్సిలర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని ఘనంగా శాలువాతో సన్మానం చేసినారు.

## 12వ వార్డు ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు.



**వలిగొండ మండలం పెన్ సత్తా, పిబ్రవరి 18:**యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని పగిడిపల్లిలో 12వ మున్సిపల్ కౌన్సిల్ నెంబర్ గా విజయం సాధించిన తోటకూరి విజయలక్ష్మి వెంకటేష్ మీడియాతో మాట్లాడుతూ. నా గెలుపుకు సహకరించిన 12వ వార్డు ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు.

12వ వార్డు ఓటర్లకు 24 గంటలు అందుబాటులో ఉంటానని.

ఏ సమస్యనైనా నాకు చెప్పవచ్చునని.

12 వార్డు అభివృద్ధికి అన్ని విధాలుగా ఎమ్మెల్యే సహకారంతోటి ఏర్పాటు చేయిస్తానని.

12వ వార్డు ప్రజలకు ఓటర్లకు యువకులకు మీడియా ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు.

12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా గెలుపొందిన తొటకూరి విజయలక్ష్మి వెంకటేశును మీడియా జిల్లా స్టాపర్ గోలనుకొండ బాలరాజు శాలువాతో సన్మానం చేసినారు.

## తెలంగాణ తొలి ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు,

**పోలంపల్లిలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో,**

**చేగుంట : పెన్ సత్తా, పిబ్రవరి 18:**చేగుంట మండలం పోలంపల్లి గ్రామంలో, మాజీ సర్పంచ్ కోండి మల్లేశం అధ్యక్షతన బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పుట్టినరోజు వేడుక ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో పోలంపల్లి బిఆర్ఎస్ పార్టీ గ్రామ సభ్యులు టిఆర్ఎస్ పార్టీ యూత్ సభ్యులు భారీ ఎత్తున పాల్గొని తెలంగాణ నినాదాలతో గ్రామంలో ఆనందోత్సవంతో



కారణజన్ముడు జన్మదిన వేడుకలు నిర్వహించారు,

## పెబ్బేరు మున్సిపాలిటీ రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం...




**ఓడిపోయిన కౌన్సిలర్లు అధైర్యం వద్దు...**

**కౌన్సిలర్లతో సమానంగా ప్రాధాన్యత ఉంటుంది...**

**ఎమ్మెల్యే మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షులు శివసేనారెడ్డి**

**పెబ్బేరు పెన్ సత్తా, పిబ్రవరి 18:**మున్సిపాలిటీ చైర్మన్ గా ఎన్నికైన అక్కి శ్రీనివాస్ గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథులుగా ఈ పాల్గొన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షులు శివసేనారెడ్డి శాలువాతో.. సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెబ్బేరు మున్సిపాలిటీ రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా మార్చితాం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఏ సమస్య ఉన్న తాను అందుబాటులో ఉంటూ పరిష్కరిస్తానని వెల్లడించారు.

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిపాలైన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు ఎవరు అధైర్య పడకూడదని, ప్రస్తుతం గెలిచిన కౌన్సిలర్లతో పాటే మీకు ప్రాధాన్యత ఉంటుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి,డీసీసీ అధ్యక్షుడు శివసేనరెడ్డి పేర్కొన్నారు.బుధవారం పెబ్బేరు మున్సిపాలిటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఉపాధ్యక్షులు సుమిత్ర ఎల్లారెడ్డిని వారు పెబ్బేరు మున్సిపల్ కార్యాలయంలో సన్మానించి అభినందించారు.చైర్మన్ వైస్ చైర్మన్ బాధ్యత స్వీకరణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో అన్ని వార్డుల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఊరేగింపును నిర్వహించారు.మొదట ఊరేగింపునకు హాజరైన ఎమ్మెల్యే మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షులు శివసేనారెడ్డి లను వారు గజమాలతో సత్కరించి పూల వర్షం కురిపిస్తూ బాణాసంచా కాల్చుతూ డప్పు వాయిద్యాల మధ్యన నృత్యాలు చేస్తూ ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా సుభాష్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు చేపట్టిన భారీ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని కోలాహలంగా బయలుదేరారు.మహిళలు ఉత్సాహంగా నృత్యాలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ తరపున బీ ఫామ్ పంపింది ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులందరిని పెబ్బేరు పట్టణ ప్రజలు ఎంతగానో ఆదరించారనీ...దాంతో పెబ్బేరు మున్సిపాలిటీ చైర్మన్ గా అక్కి శ్రీనివాస్ గౌడ్,వైస్ చైర్మన్ గా సుమిత్ర ఎల్లారెడ్డి పదవి బాధ్యతలు చేపట్టారని వారు పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి పల్లెలను పట్టణాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తుందని వారు అన్నారు.పెబ్బేరు పట్టణానికి సంబంధించిన 30 పడకల ఆసుపత్రి, రోడ్డు విస్తరణ, సంత స్థల వివాదం, సీసీ రోడ్లు, వీధిలైట్లు, లాంటి అనేక మౌలిక వసతులపై దృష్టి సారించి కేవలం సంవత్సరంలో పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు.కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు,మాజీ కౌన్సిలర్లు, పెబ్బేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల నాయకులు, మహిళలు, కార్యకర్తలు యువకులు, పెద్దలు పార్టీ శ్రేణులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## వలిగొండ మండల పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే



**పెన్ సత్తా, పిబ్రవరి 18:**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో రైతు వేదిక దగ్గర ఎమ్మెల్యే పాల్గొని మండల పరిధిలోని లబ్ధిదారులకు 54 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు ఎమ్మెల్యే స్వయంగా అందజేసినారు మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో కాంగ్రెస్ పరిపాలనలో రేవంత్ రెడ్డి సమక్షంలో పేదవారికి అనేక సంక్షేమ పథకాలు అందజేయడమే ఇందిరా పాలన అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎన్ ఎస్ సి ఐ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యకర్తలు రెవెన్యూ సిబ్బంది జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రెస్ రిలీజ్:-

**క్వార్టర్ ఫైనల్ లో ఆంధ్ర సీనియర్ మహిళల జట్టు**



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 18:** గౌ గౌహటి లో గురువారం జమ్మూ కాశ్మీర్ (జెడకే)పై కఠిన పోరాటంలో విజయం సాధించి, ఆంధ్ర సీనియర్ మహిళల క్రికెట్ జట్టు బీసీసీఐ సీనియర్ మహిళల వన్డే టోర్నీలో క్వార్టర్ ఫైనల్ ను ఖరారు చేసుకుంది. గ్రూప్ డి నుంచి టాప్ పోజిషన్ లో ఉంది. ఈ జట్టు, ముంబై, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, ఝార్ఖండ్, జెడకే, గుజరాత్ వంటి బలమైన ప్రత్యర్థులతో జరిగిన గ్రూప్ స్టేజ్ మ్యాచ్ లలో 4 విజయాలు సాధించి తమ స్థానాన్ని బలపరిచింది. ఆంధ్ర జట్టు 23 ఫిబ్రవరి న చండీగఢ్‌లో రాజస్థాన్ పై క్వార్టర్ ఫైనల్‌లో ఆడనుంది. అంజలి సర్వాని సక్సెస్‌ఫుల్ కెప్టెన్సీలో జట్టు అసాధారణ నైపుణ్యం, ద్రుఢసంకల్పాన్ని ప్రదర్శించింది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసిఏ) ఈ స్క్వాడ్‌ను కు మద్దతు ఇచ్చి ఈ స్థాయికి చేరుకోవడానికి కీలక పాత్ర పోషించింది. ఈ ఏడాది ఆంధ్ర క్రికెట్‌కు చారిత్రక మైలురాయి, అన్ని ఏజ్ గ్రూపుల జట్లు నాక్ అవుట్‌లకు అర్హత పొందాయి. ఏసిఏ నిరంతర అభివృద్ధి కృషికి ఇది నిదర్శనం.


## నక్కపల్లి లో ఘనంగా సీఎం రమేష్ జన్మదిన వేడుకలు





**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 18:** అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ జన్మదిన వేడుకలు మండల కేంద్రం నక్కపల్లి లో ఘనంగా జరిగాయి. పార్టీ అధ్యక్షులు నానాజీ ఆధ్వర్యంలో బుధవారం పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం ఉపమాక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సీఎం రమేష్ పేరున ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు చేయించారు. ఈ కార్యక్రమంలో పాకలపాటి రవిరాజు, శ్రీరంగం రమేష్, దాడిశెట్టి ఈశ్వరరావు, కోసూరి శ్రీనివాసరావు, మీగడ సత్తిబాబు, కేవీ సత్యనారాయణ, ఇబ్రహీం భాషా,షేక్ ఇమామ్, గింజాల వెంకటరమణ, కొలనాటి అప్పారావు , గట్టెం నానాజీ, బుద్దాల నాగమణి, బంగారు శివ, ఈగల వెంకటేశ్వరరావు,మైలపల్లి అమ్మోరయ్య , రంజాజ్ బీ, కుమారి,తదితరులు పాల్గొన్నారు.

## ఉపమాక వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న గొల్ల బాబురావు





**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 18:** ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక శ్రీ కల్కి వేంకటేశ్వర స్వామివారిని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు బుధవారం దర్శించుకున్నారు. స్వామివారి ఆలయానికి వచ్చిన రాజ్యసభ ఎంపీ గొల్ల బాబురావుకు పాయకరావుపేట నియోజకవర్గ వైయస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఉపమాక కల్కి వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చక బృందం, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతించి స్వామి వారి దర్శనాన్ని కల్పించారు. ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి ఆలయ సిబ్బంది సాలువతో ఘనంగా సత్కరించారు. వైయస్సార్ సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వామివారి ఆలయం వద్ద గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలతో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గం వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోడింగ్ కంటే ఏఐతో పనిచేయించడం ముఖ్యం




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ గ్రామర్‌ను తిరిగి రాస్తోంది, ఇకపై టెక్ నిపుణులకు కోడ్స్ రాయడం అంత ముఖ్యమైన పని కాదని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని అన్నారు. మంగళవారం బెంగళూరులో జరిగిన ఇన్ఫోసిస్ ఇన్వెస్టర్ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ఇంటర్నెట్ నుంచి స్మార్ట్‌ఫోన్‌లకు గతంలో జరిగిన ఏ సాంకేతిక మార్పు కూడా ఇంత వేగంగా జరగలేదు. వాటి కంటే వేగంగా ఏఐని అలవాటు చేసుకుంటున్నారని, వ్యాపారాల నిర్వహణను పూర్తిస్థాయి మార్చేందుకు ఏఐ సిద్ధంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో కోడ్స్ రాయడం అంత ముఖ్యం కాకపోవచ్చు, ఏఐతో పని చేయించడం, టూల్స్‌ను వాడి వ్యాపారాభివృద్ధిని సాధించడమే అత్యంత ప్రధానం. రానున్న రోజుల్లో "కంపెనీలు కస్టమర్లకు అందించే సేవలు, పని చేసే విధానం, సంస్థ ఉద్దేశాల్లో మార్పులు రావాలి. ఇకమీదట ఏ మాత్రం పాత పద్ధతిలోనే సంస్థలు పనులు చేయలేవని నందన్ నీలేకని అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో కోడింగ్‌కు ప్రధాన్యత తగ్గే ఛాన్స్ ఉన్నా సరే, కొత్త ఉద్యోగాలు కూడా అంతే వేగంగా పుట్టుకొస్తాయని ఆయన స్పష్టం చేశారు.

## తొలి ఈవీ కారును విడుదల చేసిన మారుతీ సుజుకి



దేశీయ అతిపెద్ద ప్యాసింజర్ కార్ల దిగ్గజం మారుతీ సుజుకి ఎట్టకేలకు ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) విభాగంలోకి అడుగుపెట్టింది. మంగళవారం కంపెనీ ఎంతో ఆసక్తిగా ఎదురూచుస్తున్న తన మొట్టమొదటి ఈవీ ఎస్‌యూవీ ఈ-విటారా లాంచ్ చేస్తూ, ధరల వివరాలను కూడా ప్రకటించింది. రూ. 10.99 లక్షల ప్రారంభ ధరతో తీసుకొచ్చిన ఈ కారు బ్యాటరీ-యాజ్-ఏ-సర్వీస్(బాస్) మోడల్ ఆధారంగా లభిస్తుంది. అంటే బ్యాటరీ కోసం ఈఎంఐ రూపంలో కిలోమీటర్‌కు రూ. 3.99 చొప్పున విడిగా చెల్లించాల్సి ఉంటుంది. 8 ఏళ్ల బ్యాటరీ వారెంట్‌తో అందుబాటులో ఉన్న ఈ కారు 49 కిలోవాట్ అవర్, 61 కిలోవాట్ అవర్ బ్యాటరీ ఆప్షన్లతో లభిస్తుంది. ఒక్కసారి పూర్తి ఛార్జ్ చేసిన తర్వాత 440 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. 61 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 543 కిలోమీటర్లు వెళ్లొచ్చని కంపెనీ తెలిపింది. ఈ కారును కొనాలనుకునే కస్టమర్లు కంపెనీ అధికారిక వెబ్‌సైట్ లేదా డీలర్‌షిప్ సెంటర్ల వద్ద రూ.21 వేలు చెల్లించి బుకింగ్ చేయవచ్చు. డెలివరీలు త్వరలో ప్రారంభం అవుతాయని కంపెనీ స్పష్టం చేసింది. అలాగే, త్వరలో పూర్తి వేరియంట్ వారీగా ధరల వివరాలను వెల్లడించనున్నట్లు తెలిపింది. గతేడాది ఆగష్టులోనే కంపెనీ ఈ-విటారా ఉత్పత్తిని ప్రారంభించింది. ఏడాది ఆఖరు నాటికి సుమారు 13 వేల యూనిట్లను 28 దేశాలకు ఎగుమతి కూడా చేసింది.

## ఓలా ఎలక్ట్రిక్ షేర్లు 83 శాతం పతనం భారీగా ఇన్వెస్టర్ల సంపద ఆవిరి




ఎంతో ఆర్భాటంగా స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించిన ఓలా ఎలక్ట్రిక్ కంపెనీ షేర్లు కుప్పకూలిపోతున్నాయి. ఆల్‌టైం గరిష్టాల నుంచి భారీ నష్టాలను చవి చూడటంతో ఇన్వెస్టర్లు లబోదిబోమంటున్నారు. వరుసగా నాలుగో రోజు మంగళవారం కూడా ఓలా షేర్లు పతనమయ్యాయి. ఇంట్రాడేలో 5 శాతం క్షీణించి 27.36 కనిష్ట స్థాయిని తాకగా.. తుదకు 2.91 శాతం నష్టంతో రూ.27.99 వద్ద ముగిసింది. ఓలా రేటింగ్‌ను అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ సిటీ 'బై' నుంచి 'సెల్'కి తగ్గిస్తూ.. టార్గెట్ ధరకు 51 శాతం కోత పెట్టి రూ.27గా నిర్ణయించడమే ఇందుకు ప్రధాన కారణం. 2024లో చేరిన గరిష్ట స్థాయి రూ.157తో పోలిస్తే ఈ స్టాక్ ఏకంగా 83శాతం మేర పడిపోయి ఇన్వెస్టర్ల సంపదను ఆవిరి చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో ఆదాయం 55 శాతం తగ్గి రూ.470 కోట్లకు పడిపోయింది. నికర నష్టం రూ.487 కోట్లకు పెరగడం ఇన్వెస్టర్లలో మరింత ఆందోళన పెంచింది. ఒకప్పుడు అగ్రస్థానంలో ఉన్న ఓలా ప్రస్తుతం 6 శాతం మార్కెట్ వాటాతో ఐదో స్థానానికి పడిపోయింది. టీవీఎస్, బజాజ్, ఆథర్ వంటి సంస్థల నుంచి గట్టి పోటీని ఎదుర్కొంటుంది. వినియోగదారుల నుంచి సర్వీస్, నాణ్యత పరంగా వస్తున్న ఫిర్యాదులు బ్రాండ్ విలువను దెబ్బతీశాయి. మరోవైపు కంపెనీ వద్ద నగదు నిల్వలు తగ్గడం, అప్పులు పెరగడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేస్తోంది.

## ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

ప్రపంచ దేశాలకు జనరిక్ ఔషధాల సరఫరాలో అగ్రగామిగా ఉన్న భారత్, 2030 నాటికి బయోలాజిక్స్, బయోసిమిలర్స్ విభాగాల్లో భారీ మార్పులు చూడబోతోందని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ సహ-ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జీవీ ప్రసాద్ అన్నారు. బయో-ఆసియా 2026 సదస్సులో భాగంగా 'ఫ్యూచర్ ఆఫ్ ఫార్మా, బయోటెక్' అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. ఉత్పత్తులు- సేవల రంగం అనూహ్యంగా వృద్ధి చెందే అవకాశాలున్నాయని వివరించారు. ప్రపంచ స్థాయి కంపెనీలు ఇప్పుడు భారత్‌ను తమ ప్రధాన తయారీ కేంద్రంగానే కాకుండా, పరిశోధన-అభివృద్ధి (ఆర్అండ్‌డీ) కోసమూ చూస్తున్నాయని తెలిపారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ల ద్వారా భారత కంపెనీలు ప్రపంచ వ్యాప్తంగా కీలకపాత్ర పోషిస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ దశలో వివిధ కంపెనీల మధ్య అర్థవంతమైన భాగస్వామ్యాలు అవసరమని సూచించారు. మనం జనరిక్ రంగంలో బలంగా ఉంటూనే, వ్యూహాత్మక పెట్టుబడుల ద్వారా ఆవిష్కరణలపైనా దృష్టి పెట్టాలని సూచించారు. చైనా తరహాలో వేగంగా ఉత్పత్తిని పెంచాలన్నారు.

# ప్రపంచ వ్యాప్తంగా యూట్యూబ్ డౌన్..




ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ అయిన యూట్యూబ్ సేవలు నిలిచిపోయాయి. చీ (ట్విట్టర్)లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఫిబ్రవరి 17 సాయంత్రం యూట్యూబ్ చరిత్రలోనే ఇది అతిపెద్ద ఔటేజ్ అని చెబుతున్నారు. దీనిపై యూజర్స్ పలు సోషల్ మీడియా వేదికల్లో పోస్టులు పెడుతున్నారు. డౌన్ డిటెక్టర్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 3 లక్షలకు పైగా యూజర్లు తమ సమస్యను రిపోర్ట్ చేశారు. ఒక్క అమెరికాలోనే 2.4 నుండి 3.2 లక్షల వరకు ఫిర్యాదులు వచ్చాయి. యూట్యూబ్ ఓపెన్ అవకుండా "హనీఎవబిష్ప్రతినిణ లివనిబి లితీనీనిణ" అనే ఎర్రర్ మెసేజ్ చూపించిందని పేర్కొన్నారు. యాప్ మరియు వెబ్‌సైట్ లోడ్ కాకపోవడం, వీడియోలు ప్లే అవకపోవడం వంటి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇండియా, జిఐ, కెనడా, బ్రెజిల్ వంటి అనేక దేశాల్లో ఈ ఇష్యూస్ కనిపించాయి. దీనిపై స్పందించిన యూ ట్యూబ్.. సమస్య ఏమిటో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం అని మాత్రమే తెలిపింది. కాగా రాయిటర్స్, టెక్ రీడర్స్ వంటి అంతర్జాతీయ మీడియా దీనిని సాధారణ టెక్నికల్ గ్లిచ్ గా అభివర్ణించాయి. ఇందులో ఎలాంటి హ్యాకర్స్ కుట్ర లేదని తెలిపాయి. అదే విధంగా ఫిబ్రవరి 16న ఎక్స్ కూడా కొన్ని గంటల పాటు ఔటేజ్ కి గురైంది. నమోదైంది. 2 గంటల పాటు ఫీడ్ రిఫ్రెష్ కాకపోవడం, లాగిన్ సమస్యలు, యాప్ లోడ్ అవకపోవడం వంటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. పీక్ అవర్ లో 40,000కు పైగా రిపోర్టులు నమోదయ్యాయి. కాగా దీనిపై 'చీ' కూడా అధికారికంగా స్పష్టమైన కారణం చెప్పలేదు. అయితే ఈ రెండు సందర్భాల్లోనూ హ్యాకింగ్ గాని డేటా బ్రీచ్ జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవు. పెద్ద ప్లాట్‌ఫామ్స్‌కి ట్రాఫిక్ పెరగడం, సర్వర్ మెయింటెనెన్స్, క్లౌడ్ సర్వీస్ సమస్యలు, నెట్‌వర్క్ లోపాలు వంటి కారణాల వల్ల అప్పుడప్పుడూ ఇలాంటి ఔటేజెస్ రావడం సాధారణమని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ హ్యాకింగ్ జరిగితే డేటా లీక్, అకౌంట్ సస్పెన్షన్, సెక్యూరిటీ అలర్ట్స్ కనిపిస్తాయి. యూట్యూబ్, ఎక్స్ ఔటేజ్ లో అలాంటివేవీ కనబడక పోవడంతో ఇవి సాధారణ సాంకేతిక లోపాలే అని చెప్పవచ్చు.

# ఏసీ ధరలు పెరుగుతున్నాయ్




ఎండాకాలం మొదలైంది. పెరిగే ఉష్ణోగ్రతల కారణంగా ఏసీలకు పెద్ద ఎత్తున గిరాకీ ఉండనుంది. అయితే, కొత్త ఏసీ కొనాలనుకునే వారికి కంపెనీలు షాక్ ఇవ్వనున్నాయి. ప్రస్తుత త్రైమాసికంలో ఎయిర్ కండిషనర్(ఏసీ) ధరలు పెరుగుతాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ప్రముఖ ఏసీ తయారీ కంపెనీ బ్లూస్టార్ ఇప్పటికే 10-15 శాతం మేర ధరలు పెంచేందుకు సిద్ధమవుతున్నామని స్పష్టం చేసింది. ప్రస్తుత పరిస్థితుల మధ్య ధరల పెంపును నివారించలేమని బ్లూస్టార్ మేనేజింగ్ డైరెక్టర్ బి త్యాగరాజన్ అన్నారు. రాగి లాంటి కీలక ముడి సరుకుల ధరలు భారీగా పెరిగాయని, దీనికి తోడు భారత కరెన్సీ రూపాయి మారకం రేటు వల్ల ఏసీ ఖర్చులను పెంచుతున్నాయి. దీనికి అదనంగా ఇంధన-సామర్థ్య లేబులింగ్ లాంటి కొత్త నిబంధనలు కూడా ఖర్చుల భారం పెంచుతోందని త్యాగరాజన్ తెలిపారు. అయితే, పరిశ్రమ కేవలం 8-10 శాతం తక్కువ లాభాల మార్జిన్‌తో కొనసాగుతోందని, కాబట్టి ముడిసరుకు వ్యయాన్ని భరించే స్థితిలో కంపెనీలు లేవు. ఫలితంగా అదనపు ఖర్చుల భారాన్ని కొంతమేర వినియోగదారులకూ బదిలీ చేయక తప్పదని స్పష్టం చేశారు. కొత్త ఎనర్జీ లేబుల్ నిబంధనల వల్లే ఏసీ స్టార్ రేటింగ్‌ని బట్టి ధరలు 5-10 శాతం పెరుగుతాయని త్యాగరాజన్ అభిప్రాయపడ్డారు. కంపెనీలు సాధారణంగా మెరుగైన డిజైన్, సామర్థ్యం ద్వారా ఖర్చులను తగ్గించడానికి ప్రయత్నించినప్పటికీ, ఈసారి పెరుగుతున్న ముడి సరుకుల ధరలు, కరెన్సీ ఒత్తిడి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడాన్ని కష్టతరం చేశాయని పేర్కొన్నారు.

## తైవాన్‌కు ఆయుధ సరఫరాపై త్వరలోనే నిర్ణయం



తైవాన్‌కు ఆయుధాలను పంపాలా వద్దా అనే విషయంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. తైవాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హెచ్చరించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్య చేశారు. 'ఈ విషయంపై జిన్‌పింగ్‌తో మాట్లాడుతున్నాను. మా మధ్య మంచి సంభాషణ జరిగింది. త్వరలోనే నిర్ణయం తీసుకుంటా' అని ఆయన తెలిపారు. చైనా నేతతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని ట్రంప్ అన్నారు. ఈ నెల 4వ తేదీన ట్రంప్‌తో జిన్‌పింగ్ టెలిఫోన్ సంభాషణ జరిపారు. అమెరికాతో సంబంధాల విషయంలో పరస్పర గౌరవాన్ని కలిగి ఉండాలని ఈ సందర్భంగా జిన్‌పింగ్ ఆకాంక్షించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నడుస్తున్న తైవాన్ దీవికి ఆయుధాలు విక్రయించవద్దని హెచ్చరించారు. ద్వైపాక్షిక సంబంధాలలో తైవాన్‌కు అధిక ప్రాధాన్యత ఉన్నదని, తైవాన్‌కు ఆయుధాలు విక్రయించేటప్పుడు అమెరికా జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. కాగా జిన్‌పింగ్, ట్రంప్ ఏప్రిల్‌లో సమావేశమయ్యే అవకాశం ఉంది. తైవాన్‌ను అమెరికా అధికారికంగా గుర్తించకపోయినప్పటికీ దానికి సైనిక పరంగా మద్దతు ఇస్తోంది. తైవాన్‌కు 11 బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఆయుధాలను విక్రయించేందుకు అమెరికా గత డిసెంబరులో ఆమోదం తెలిపింది.

## ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను కప్పిపుచ్చుతున్నారు



జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఫైల్స్‌ను డోనాల్డ్ ట్రంప్ కప్పిపెడుతున్నారని అమెరికా మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ విమర్శించారు. 'ముందు వాటిని బయటపెట్టండి. అవి నత్తనడక నడుస్తున్నాయి' అని బెర్లిన్‌లో ఆమె బీబీసీకి చెప్పారు. ప్రపంచ ఫోరం వార్షిక సమావేశానికి హాజరయ్యేందుకు హిల్లరీ బెర్లిన్ వచ్చారు. ఎప్‌స్టీన్‌కు చెందిన వేలాది ఫైల్స్‌ను అమెరికా న్యాయ శాఖ ఈ నెల ప్రారంభంలో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్న ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ కమిటీ ముందు హాజరు కావాల్సిందేనని హిల్లరీ స్పష్టం చేశారు. కమిటీ ముందు సాక్ష్యమివ్వాల్సిందిగా కాంగ్రెస్ కమిటీ క్లింటన్ దంపతులపై ఒత్తిడి తెచ్చింది. కమిటీ ఎదుట హాజరయ్యేందుకు వారు అంగీకరించారు. బిల్ క్లింటన్ ఈ నెల 27న, హిల్లరీ ఈ నెల 26న కమిటీ ముందు హాజరవుతారు. 1983లో అమెరికా మాజీ అధ్యక్షుడు గెరాల్డ్ ఫోర్డ్ కాంగ్రెస్ కమిటీ ముందు హాజరయ్యారు. ఆ తర్వాత దేశ మాజీ అధ్యక్షుడు కమిటీ ముందుకు రావడం ఇదే మొదటి సారి. కమిటీ ఎదుట హాజరయ్యేందుకు తమకు అభ్యంతరం ఏమీ లేదని, అయితే అది బహిరంగంగా జరగాలని హిల్లరీ చెప్పారు. కమిటీ దర్యాప్తు నిష్పాక్షికంగా జరపాలన్నదే తమ కోరిక అని, అందరినీ ఒకేలా చూడాలని ఆశిస్తున్నానని అన్నారు. 'మా వద్ద దాచేందుకు ఏమీ లేదు. ఫైల్స్‌ను పూర్తిగా విడుదల చేయాలని మేము పదే పదే అడుగుతున్నాం' అని తెలిపారు. ట్రంప్ నుంచి దృష్టి మళ్లించేందుకు తనను, తన భర్తను ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. కాగా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో క్లింటన్ ప్రస్తావన వచ్చిన విషయం తెలిసిందే. ఎప్‌స్టీన్‌తో గతంలో తనకు సంబంధం ఉన్నప్పటికీ రెండు దశాబ్దాల క్రితమే దానికి స్వస్తి చెప్పానని క్లింటన్ అంటున్నారు.

## మధ్యప్రాచ్యంలో టెన్షన్.. కదిలిన అమెరికా యుద్ధ నౌకలు, విమానాలు

ఇరాన్‌తో అణు ఒప్పందంపై చర్చలు జరుపుతూనే, అమెరికా తన సైనిక శక్తిని ప్రదర్శిస్తోంది. ఒకవైపు దౌత్యపరమైన చర్చలు కొనసాగిస్తుండగానే, మరోవైపు భారీగా యుద్ధ విమానాలను, నౌకలను మధ్యప్రాచ్యానికి తరలిస్తోంది. గత 24 గంటల్లో 50కి పైగా అధునాతన ఫైటర్ జెట్లను ఈ ప్రాంతంలో మోహరించడం అంతర్జాతీయంగా ఆసక్తి రేపుతోంది. యాక్సియోస్ కథనం ప్రకారం.. అమెరికా వాయుసేనకు చెందిన ఎఫ్-22 రాప్టర్స్, ఎఫ్-35 లైట్నింగ్ ఎఎ, ఎఫ్-16 ఫైటింగ్ ఫాల్కన్స్ వంటి శక్తిమంతమైన యుద్ధ విమానాలు ఈ మోహరింపులో ఉన్నాయి. అమెరికా, యూరప్‌లోని స్థావరాల నుంచి ఈ విమానాలను జోర్డాన్, ఖతార్‌లోని సైనిక స్థావరాలకు తరలించారు. ఇదే సమయంలో, యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్. ఫోర్డ్ విమానవాహక నౌక తన బృందంతో కలిసి కరేబియన్‌ను వీడి మధ్యప్రాచ్యం వైపు పయనిస్తోంది. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో అమెరికా, ఇరాన్ మధ్య అణు ఒప్పందంపై రెండో విడత పరోక్ష చర్చలు జరిగిన నేపథ్యంలో ఈ సైనిక మోహరింపు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒమన్ మధ్యవర్తిత్వంతో జరిగిన ఈ చర్చలు ఫలప్రదంగా సాగాయని, నిర్మాణాత్మక వాతావరణంలో జరిగాయని ఇరు దేశాల అధికారులు తెలిపారు. అయినప్పటికీ, చర్చలతో పాటు సైనిక ఒత్తిడిని కొనసాగించడం ద్వారా ఇరాన్‌పై మరింత ఒత్తిడి పెంచడమే అమెరికా వ్యూహంగా కనిపిస్తోంది. ప్రస్తుతం యూఎస్ఎస్ అబ్రహం లింకన్ యుద్ధ నౌక ఈ ప్రాంతంలో ఉండగా, ఇప్పుడు గెరాల్డ్ ఆర్. ఫోర్డ్ రాకతో అమెరికా సైనిక బలం మరింత పెరగనుంది. రాబోయే రెండు వారాల్లో ఇరాన్ నుంచి ప్రతిపాదనలు అందాక, తదుపరి చర్చలు జరిగే అవకాశం ఉంది.

## అమెరికా-ఇరాన్ అణు చర్చలు ప్రారంభం

అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్ రాజధాని జెనీవాలో రెండో విడత అణు చర్చలు మంగళవారం ప్రారంభమయ్యాయి. నగరంలోని ఒమానీ మ్యూజియంలో ఈ చర్చలు జరుగుతున్నాయి. ఇరాన్ అణు కార్యక్రమంపై నెలకొన్న వివాదాన్ని పరిష్కరించే దిశగా చర్చలు సాగుతున్నాయి. ఇరాన్ ఒప్పందాన్ని కోరుకుంటోందని ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విలేకరులకు చెప్పారు. తమ అణు కార్యక్రమంపై అమెరికా వైఖరి వాస్తవాలకు దగ్గరగా ఉన్నదని ఇరాన్ విదేశాంగ శాఖ వ్యాఖ్యానించింది. ఒమన్ మధ్య వర్తిత్వంతో జరుగుతున్న ఈ చర్చలు తమ అణు కార్యక్రమం పైన, అమెరికా విధించిన ఆంక్షల ఎత్తివేత పైన దృష్టి సారిస్తాయని తెలిపింది. ఇరాన్ క్షిపణి అభివృద్ధి కార్యక్రమంపై కూడా చర్చించాల్సి ఉన్నదని అమెరికా గతంలో తెలిపింది. ఇరాన్‌తో జరుగుతున్న చర్చలు చాలా ముఖ్యమైనవని ట్రంప్ తెలిపారు. వీటిలో తాను పరోక్షంగా భాగస్వామిని అవుతానని చెప్పారు. అణు కార్యక్రమంపై కఠిన వైఖరితో ఉంటే ఏం జరుగుతుందో ఇరాన్‌కు బాగా తెలుసునని వ్యాఖ్యానించారు.

## ఎడిటోరియల్

# అప్పుల భారతం!

సామాన్యులే కాకుండా ప్రభుత్వాలు సైతం అప్పులు లేనిదే ముందుకు వెళ్లలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ అప్పులు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల గమనాన్ని నిర్దేశిస్తున్నాయి. సామాజిక సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక స్థిరత్వం కోసం దేశాలు చేస్తున్న అప్పులు అతి భారీ స్థాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) వెల్లడించిన గణాంకాల ప్రకారం 2025 –26 నాటికి ప్రపంచ దేశాల మొత్తం అప్పు 110.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ అప్పులో ఎక్కువ భాగం ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాల్లోనే ఉండటం గమనార్హం. భారత దేశంలోని 147 కోట్ల మంది జనాభాలో ప్రతి ఒక్కరిపై ఈ ఏడాది మార్చి నాటికి రూ. 1.34 లక్షల కోట్ల అప్పు ఉంది. ఇది వ్యక్తులు చేసిన అప్పు కాదు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రుణం. అయినప్పటికీ ఈ సంవత్సరం (2026– 27) కూడా భారీ స్థాయిలో అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 14.61 లక్షల కోట్ల అప్పులు చేసిన కేంద్రం రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ. 17.2 లక్షల కోట్ల రుణాలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రుణం కంటే 17 శాతం ఎక్కువ కావడం గమనార్హం.

2026–27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రూ. 53.47 లక్షల కోట్లకు బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఇందులో మార్కెట్ నుంచి మొత్తం రూ. 17.2 లక్షల కోట్లు సేకరించాల్సి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. 2025 –26 సవరించిన అంచనాల ప్రకారం కేంద్రం మొత్తం అప్పులు రూ. 1,97,18,016 కోట్లు కాగా, మార్చి 2027 నాటికి ఇది 2,14,82,050 కోట్లకు చేరనుంది. ఇక జిడిపిలో రుణ నిష్పత్తిని 55.6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాస్తవానికి ఈ నిష్పత్తి 2019లో 50 శాతంలోపే ఉంది. ఇక తాజా బడ్జెట్‌లో జిడిపిలో ద్రవ్యలోటును 4.3 శాతంగా అంచనా వేశారు. 2026 మార్చి 31 నాటికి భారత కేంద్ర ప్రభుత్వం మొత్తం అప్పులు రూ. 197.18 లక్షల కోట్లకు (సుమారు ట్రిలియన్ డాలర్లు) చేరుకుంటాయని అంచనా వేశారు.

ఇది 2026 –27 ఆర్థిక సంవత్సరంలో మరింత పెరిగి రూ. 214.82 లక్షల కోట్లకు చేరవచ్చని బడ్జెట్ అంచనాలు వెల్లడిస్తున్నాయి. 2024లో దేశం మొత్తం అప్పు సుమారు 85 శాతంగా ఉంది. 2026 వరకు దేశవ్యాప్త అప్పుల వివరాలు: కేంద్ర అప్పులు: 2025 –26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ అప్పులు రూ. 197.18 లక్షల కోట్ల నుండి 2026 –27 నాటికి రూ. 214.82 లక్షల కోట్లకు పెరుగుతాయని అంచనా. వ్యక్తిగత భారం: 2026 ప్రారంభానికి, దేశంలోని ప్రతి పౌరుడిపై సుమారు రూ. 1.34 లక్షల అప్పు (కేంద్రం చేసిన రుణాల ప్రకారం) ఉంది. ద్రవ్యలోటు : 2025– 26లో 4.4 శాతం , 2026 –27 నాటికి 4.3 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2025– 26 నాటికి 56.1 శాతంగా ఉన్న అప్పు– జిడిపి నిష్పత్తిని, 2026– 27 నాటికి 55.6 శాతంకి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2026 మార్చి నాటికి అప్పులు రూ. 7.46 లక్షల కోట్లకు చేరవచ్చనిఅంచనా వేశారు. 2026 –27 బడ్జెట్‌లో గ్రాస్ మార్కెట్ బోరోయింగ్ (మొత్తం అప్పులు) సుమారు రూ. 17.2 లక్షల కోట్లుగా అంచనా వేశారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి తాజా గణాంకాల ప్రకారం ప్రపంచ దేశాల మొత్తం అప్పు 2025 నాటికి 110.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. అత్యధిక అప్పులు ఉన్న దేశాల జాబితాలో అమెరికా తొలి స్థానంలో ఉండగా, భారతదేశం 3.36 ట్రిలియన్ డాలర్లతో ఏడవ స్థానంలో ఉంది. ప్రభుత్వం తన రుణ నిష్పత్తిని 56.1 శాతం నుండి 55.6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచంలోనే అత్యధిక ప్రభుత్వ అప్పులు ఉన్న దేశంగా అగ్రరాజ్యం అమెరికా తొలి స్థానంలో నిలిచింది. అమెరికా మొత్తం అప్పు 38.27 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఇది ప్రపంచ మొత్తం అప్పులో మూడో వంతు కంటే ఎక్కువ కావడం గమనార్హం. నిరంతర బడ్జెట్ లోటు, పెరుగుతున్న వడ్డీ చెల్లింపులే ఇందుకు ప్రధాన కారణమని ఐఎంఎఫ్ పేర్కొంది.

ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనా ఈ విషయంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ డ్రాగన్ దేశం 18.68 ట్రిలియన్ డాలర్ల అప్పుల ఊబిలో ఉంది. చైనా అప్పులు 2025లో 13.6% వృద్ధితో అత్యంత వేగంగా పెరుగుతున్నట్లు ఐఎంఎఫ్ నివేదిక పేర్కొంది. రుణాల ఊబి జాబితాలో జపాన్ కూడా ఉంది. ఈ దేశం 9.83 ట్రిలియన్ డాలర్ల అప్పుతో 3వ స్థానంలో నిలిచింది. జపాన్ అప్పు దాని జిడిపిలో దాదాపు 230 శాతంగా ఉండటం ఆ దేశ ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోంది. ఇక యూరప్ దేశాల్లోని యునైటెడ్ కింగ్‌డమ్ 4.09 ట్రిలియన్ డాలర్లతో 4వ స్థానం, ఫ్రాన్స్ 3.92 ట్రిలియన్ డాలర్లతో 5వ స్థానం, ఇటలీ 3.48 ట్రిలియన్ డాలర్లతో 6వ స్థానంలో నిలిచాయి. ఆయా దేశాల్లో సామాజిక సంక్షేమం, పింఛన్ల కోసం కోసం ఇబ్బడిముబ్బడిగా ఖర్చు చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఐఎంఎఫ్ నివేదికలో పేర్కొంది. అన్ని దేశాల మాదిరిగానే భారత్ కూడా అప్పులు ఇబ్బడిముబ్బడిగా తీసుకుంటోంది. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. దీంతో అభివృద్ధి పనుల కోసం చేసే ఈ అప్పు సాధారణమేనని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఒక సానుకూల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దేశ అప్పుల నిష్పత్తిని జిడిపిలో 56.1 శాతం నుండి 55.6 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇండియా తర్వాత స్థానాల్లో జర్మనీ 3.23 ట్రిలియన్ డాలర్లు, కెనడా 2.60 ట్రిలియన్ డాలర్లు, బ్రెజిల్ 2.06 ట్రిలియన్ డాలర్ల అప్పులతో టాప్ 10 జాబితాలో నిలిచాయి. జర్మనీ ఆర్థిక క్రమశిక్షణ మారుపేరు. అయినప్పటికీ ఇంధన ఖర్చులు తదితర కారణాలతో అప్పుల పాలైంది. కెనడా, బ్రెజిల్ బడ్జెట్ లోటు, ప్రాంతీయ రుణాల కారణంగా అప్పుల ఊబిలో చిక్కుకున్నాయి.

# గోంగూర రొయ్యల ఇగురు.. ఇలా చేసి తింటే ప్లేట్ మొత్తం ఖాళీ చేయాల్సిందే!



రొయ్యలతో ఒకటి కాదు.. ఎన్నోరకాల వైరైటీలను చేసుకుని తినొచ్చు. అయితే, వీటితో చాలా మంది బిర్యానీ, వేపుడును ఎక్కువగా చేసి తింటారు. అయితే, ఈ సారి కొత్తగా గోంగూర రొయ్యల కూరను ట్రై చేసి తినండి. ఒకసారి తింటే అస్సలు వదలరు. ఇంకా దీనిని అన్నంలో కలిపి తింటే అద్భుతంగా ఉంటుంది. ఈ రెసిపీలో వాడే గోంగూర, రొయ్యలను కలిపి తీసుకోవడం వలన మన శరీరానికి కూడా చాలా మంచిది. ఎందుకంటే, ఈ రెండింటిలో కావాల్సిన పోషకాలు ఉన్నాయి. రొయ్యలను వారంలో రెండు సార్లు తీసుకుంటే పోటు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. కావాల్సిన పదార్థాలు: అర కిలో గోంగూర, అర కిలో రొయ్యలు, ఉల్లిపాయ చిన్నది, ఒక టేబుల్ స్పూన్ వెల్లుల్లి పేస్టు, పచ్చిమిర్చి – అర టీ స్పూన్ ధనియాల పొడి, ఒక టేబుల్ స్పూన్ పసుపు, అర టీ స్పూన్ మసాలా పొడి , రుచికి సరి పడినంత ఉప్పు, నూనెను తీసుకోవాలి. ముందుగా రొయ్యలను తీసుకుని శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి.

ఆ తర్వాత దానిలో పసుపు వేసి మళ్ళీ ఇంకో సారి శుభ్ర పరచండి. ఇక ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి దానిలో నూనె వేసి దానిలో గోంగూర ఆకులు వేసి రంగు మారే వరకు బాగా వేయించాలి. వీటిని ఒక గిన్నెలోకి తీసుకుని గ్రైండ్ చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మళ్ళీ పాన్ లో నూనె వేసి ఉల్లిపాయలు ముక్కలు వేసి బాగా వేయించాలి. ఆ తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ కూడా వేసి వేయించాలి. ఇక ఇప్పుడు మీరు తీసుకున్న అన్ని రకాల పొడిని బాగా మిక్స్ చేసి కలపాలి. ఇప్పుడు, ఈ మిశ్రమంలో ముందుగా తీసుకున్న రొయ్యలు వేసి 5 నిమిషాల తర్వాత గోంగూర పేస్టును కూడా బాగా మిక్స్ అయ్యేలా కలపాలి. ఇక ఇప్పుడు గ్రేవీ కోసం అర గ్లాసు నీళ్లు వేసి సన్నని మంట మీద 20 నిముషాలు ఉంచాలి. గ్రేవీగా మారాక కిందకు దించేయండి. అంతే వేడి వేడి గోంగూర రొయ్యల ఇగురు రెడీ.


# బాస్మతి రైస్ వండేటప్పుడు ఈ తప్పులు చెయ్యకూడదు

పండుగల సమయంలో బాస్మతి రైస్ ను మార్కెట్ నుంచి తెచ్చుకుని ఎన్నో వైరైటీలు చేస్తారూ. దీనితో ఎక్కువగా బిర్యానీ, పులావ్ చేసుకుని తింటాము. అయితే, వీటిని వండేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించకపోతే గింజలు విరిగిపోతాయి. చివరికి, బాస్మతి బియ్యం అన్నంలాగా మారిపోతాయి. బాస్మతి రైస్ ను మనం రోజు వండుకునే బియ్యం లాగా వీటిని అస్సలు చూడకండి. వీటిని వండే పద్ధతి వేరు అని మర్చిపోకండి. బాస్మతి రైస్ సాధారణ బియ్యం లాగా కాకుండా వీటిని బాగా ఉడకనివ్వాలి. దాని కోసం నీటిని ఎక్కువగా తీసుకోవాలి. నీరు సరిపోను తీసుకోకపోతే బియ్యం సరిగ్గా ఉడకవు. అలాగే, నీరు ఎక్కువైనా కూడా అన్నం మెత్తగా అయిపోతుంది. కాబట్టి, కప్పు బాస్మతి బియ్యానికి 2 కప్పుల నీటిని తీసుకోండి. బియ్యం ఉడికేటప్పుడు గరిటే పెట్టి ఎక్కువ సార్లు తిప్పకండి. అలా చేస్తే అది అన్నంగా లాగా అయిపోతుంది. బియ్యం ఉడికిందా లేదా అనేది చూడటానికి ఒకసారి మాత్రమే తిప్పి ఆ తర్వాత మూత పెట్టేయండి. బాస్మతి బియ్యంలో పిండి పదార్థాం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, వండే ముందు రెండ సార్లు కడిగితే సరిపోతుంది. అలా అని అదే పనిగా బలం ఉంది కదా అని బియ్యం మీద చూపించి వాటిని ఎక్కువ సార్లు కడగకండి. ఈ బియ్యాన్ని కనీసం 10 నిమిషాలు నానబెట్టాలి. ఇలా చేయడం



వలన బియ్యం త్వరగా ఉడుకుతాయి. బియ్యం ఉడికిన వెంటనే కిందకు దించేయండి. కొందరు మంట మీదే అలాగే ఉంచేస్తారు. ఇలా పొయ్యి మీదే ఉంచడం వలన అన్నం మెత్తగా అయిపోతుంది. కాబట్టి, 10 నిమిషాలు ఉంచి కిందకు దించేసి చికెన్ తో తినేయండి.

# చింతచిగురు చేపల పులుసు..



చింతచిగురు రుచే వేరు. ఎందుకంటే, అది పుల్లగా తినడానికి మంచి రుచిని ఇస్తుంది. దీనితో కూర, పప్పు ఎక్కువగా చేసుకుని తింటారు. అయితే, అందరూ నార్మల్ గా చేసుకుని తింటారు. కానీ, చేపలతో చింతచిగురు తింటే ఆ కిక్కే వేరబ్బా అని అందరూ అనాల్సిందే. చింత చిగురు చేపల పులుసు వినడానికి కొత్తగా ఉన్నా చేసుకుని తింటే రుచి అద్భుతంగా ఉంటుంది. మరి, ఇంకెందుకు లేట్ దానికి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం గురించి ఇక్కడ తెలుసుకుందాం.

స్టెప్ – 1: ముందుగా చేప ముక్కలను తీసుకుని ఉప్పుతో బాగా కడిగి శుభ్ర పరచుకోవాలి. కడిగిన తర్వాత ఇంకా వాసన వస్తే పసుపు, ఉప్పు వేసి మళ్ళీ కలుపుకోండి. ఆ తర్వాత వాటిని ఒక ప్లేట్ లోకి తీసుకుని ఉప్పు, కారం మసాలాలు పట్టించి పక్కన పెట్టుకోవాలి.

స్టెప్ – 2: ఇప్పుడు స్టవ్ వెలిగించి పాన్ లో ఆయిల్ వేసి అది వేడయ్యాక దానిలో జీలకర్ర, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు వేసి రంగు మారే వరకు దోరగా వేయించాలి. స్టెప్ – 3: ఇప్పుడు చేప ముక్కలను తీసుకుని, దానిలో కొద్దిగా నీళ్ళు పోసి, చింతచిగురును కూడా వేసి, మూత పెట్టి సన్నటి మంటపై ఉడికించాలి. చేప ముక్కలు మెత్తగా ఉడికి, నూనె పైకి తేలే వరకు పొయ్యి మీదే ఉంచి, దింపే ముందు కొత్తిమీరను చల్లుకుంటే మరింత రుచిగా ఉంటుంది. అంతే వేడి వేడి చింతచిగురు చేపల పులుసు రెడీ. చింతచిగురు అన్ని సీజన్లలో ఉండదు కాబట్టి, అది లేనప్పుడు చింతపండు రసంతో కూడా దీనిని చేసుకోవచ్చు. చిన్న చేపలతో ఇలా చేసుకుంటే తినడానికి రుచిగా ఉంటుంది.

# ఇండియన్, వెస్ట్రన్ టాయిలెట్ ఏది బెస్ట్?

సౌకర్యం ముఖ్యం అనుకుని మనం మార్చుకున్న ఒక చిన్న అలవాటు.. మన జీర్ణ వ్యవస్థను నెమ్మదిగా దెబ్బతీస్తోందా..? ఒకప్పుడు ప్రతి ఇంట్లో ఉన్న ఇండియన్ టాయిలెట్ల స్థానాన్ని వెస్ట్రన్ కమోడ్లు ఆక్రమించాయి. ఆధునిక జీవనశైలిలో మన అలవాట్లు మారుతున్నాయి.. మన ఇళ్లు మారుతున్నాయి. ఒకప్పుడు ప్రతి ఇంట్లో కనిపించిన ఇండియన్ టాయిలెట్ స్థానాన్ని ఇప్పుడు వెస్ట్రన్ కమోడ్స్ ఆక్రమించాయి. అయితే ఈ మార్పు సౌకర్యాన్ని ఇస్తున్నప్పటికీ.. మన జీర్ణ వ్యవస్థను దెబ్బతీస్తోందా? ఇటీవల పెరుగుతున్న మలబద్ధకం, పైల్స్ సమస్యలకు టాయిలెట్ భంగిమకు ఏమైనా సంబంధం ఉందా..? భారతీయ శైలిలో మోకాళ్లు వంచి కూర్చోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ భంగిమలో కూర్చున్నప్పుడు పురీషనాళం నిటారుగా మారుతుంది. దీనివల్ల మలం ఎటువంటి అవరోధం లేకుండా సులభంగా బయటకు వెళ్తుంది. ఈ పొజిషన్ కటి కండరాలు సమర్థవంతంగా పనిచేయడానికి ిం

సహాయపడుతుంది. ప్రేగులపై అనవసరమైన ఒత్తిడిని తగ్గిస్తుంది. పొట్ట పూర్తిగా ఖాళీ అవ్వడం వల్ల మలబద్ధకం సమస్య దరిచేరదు. వెస్ట్రన్ టాయిలెట్ల మీద కుర్చీలో కూర్చున్నట్లు కూర్చోవడం సౌకర్యంగా ఉన్నప్పటికీ అది కొన్ని సమస్యలకు దారితీయవచ్చు. ఈ భంగిమలో పురీషనాళం కొద్దిగా వంగి ఉంటుంది. దీనివల్ల పేగులను పూర్తిగా ఖాళీ చేయడం శరీరానికి కష్టమవుతుంది. అసంపూర్ణ మలవిసర్జన కాలక్రమేణా మలబద్ధకం, గ్యాస్, మూలవ్యాధుల వంటి సమస్యలకు దారితీస్తుంది. అయితే అందరికీ ఇండియన్ టాయిలెట్లే

వాడాలని నియమం లేదు. మోకాళ్ల నొప్పులు, కీళ్ల సమస్యలు ఉన్నవారు లేదా వృద్ధులకు వెస్ట్రన్ టాయిలెట్లు సురక్షితమైనవి. మీరు వెస్ట్రన్ టాయిలెట్ వాడుతున్నట్లయితే, మీ పాదాల కింద ఒక చిన్న స్టూల్ ఉంచుకోవడం వల్ల మోకాళ్లు పైకి లేచి ఇండియన్ టాయిలెట్ భంగిమ వస్తుంది. ఇది మలవిసర్జనను సులభతరం చేస్తుంది. జంక్ ఫుడ్, శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఇప్పటికే జీర్ణ సమస్యలు పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో సరైన టాయిలెట్ భంగిమను ఎంచుకోవడం వల్ల మీ పేగుల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

# గ్రూప్ స్టేజ్‌లో ఓటమన్నదే లేదు.. నెదర్లాండ్స్‌పై భారత్ ఘన విజయం

గాంధీనగర్: ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 గ్రూప్ దశను టీమిండియా అజేయంగా ముగించింది. బుధవారం (ఫిబ్రవరి 18) అహ్మదాబాద్?లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన చివరి గ్రూప్ మ్యాచులో నెదర్లాండ్స్?పై టీమిండియా ఘన విజయం సాధించింది. శివమ్ దూబే (66) మెరుపు హాఫ్ సెంచరీతో చెలరేగగా.. బౌలింగ్?లో వరుణ్ చక్రవర్తి 3 వికెట్లు తీయడంతో నెదర్లాండ్స్?పై భారత్ 17 పరుగుల తేడాతో గెలుపొందింది.



తద్వారా గ్రూప్ స్టేజ్?లో ఓటమన్నదే ఎరగకుండా సగర్వంగా సూపర్ 8 రౌండ్?కు దూసుకెళ్లింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. అనంతరం 194 పరుగుల లక్ష్య ఛేధనకు దిగిన నెదర్లాండ్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 176 రన్స్ చేసి 17 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. శివమ్ దూబే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకున్నాడు.

అభి హ్యాట్రిక్ డకౌట్.. దూబే సిక్సర్ల వర్షం:

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ తీసుకున్న టీమిండియాకు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ తన వైఫల్యాల పరంపరను కొనసాగించాడు. వరుసగా మూడో మ్యాచులోనూ డకౌటై తీవ్రంగా నిరాశపర్చాడు. తొలి ఓవర్లలోనే ఆర్యన్ దత్ బౌలింగ్?లో క్లీన్ బౌల్డ్ అయ్యి పెవిలియన్ బాట పట్టాడు.

పాకిస్తాన్‌పై వీరోచిత ఇన్సింగ్స్ ఆడిన మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ కూడా (18) త్వరగానే ఔట్ అయ్యాడు. ఆర్యన్ దత్ బౌలింగ్?లో భారీ షాట్ ఆడబోయే క్రమంలో దురదృష్టవశాత్తూ బౌల్డ్ అయ్యాడు. ఈ దశలో కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ (34), తిలక్ వర్మ (31) ఇన్నింగ్స్?ను ముందుకు తీసుకెళ్లారు.

తిలక్ ఔటైన తర్వాత క్రీజులో వచ్చిన దూబే మొదట్లో ఆచితూచి ఆడాడు. చివర్లో గేర్ మార్చి నెదర్లాండ్స్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 25 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 31 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 66 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. చివర్లో హార్దిక్ పాండ్యా కూడా సిక్సర్లతో మెరుపులు మెరిపించాడు. నెదర్లాండ్స్ బౌలర్లలో ఆర్యన్ దత్ రెండు వికెట్లు తీశాడు. లోగాన్ వాన్ బీక్ మూడు వికెట్లు పడగొట్టాడు. కైల్ క్లైన్ ఒక వికెట్ సాధించాడు.

**పోరాడిన పసికూన:**

194 పరుగుల భారీ లక్ష్యంతో ఛేధనకు దిగిన నెదర్లాండ్స్ విజయం కోసం చివరి వరకు పోరాడింది. ఓపెనర్లు మైఖేల్ లెవిట్ (24), మాక్స్ ఓ'డౌడ్ (20) మంచి శుభారంభం అందించారు. బాస్ డి లీడే (30), కాలిన్ అకెర్మాన్ (23) కూడా ఫర్వాలేదనిపించారు. కానీ భారత బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్?తో ఒత్తిడి పెంచడంతో బంతులకు చేయాల్సిన పరుగులకు భారీ తేడా ఏర్పడింది.

చివర్లో జాచ్ లయన్-కాచెట్ (26), నోహ్ క్రోస్ (25) మెరుపులు మెరిపించారు. లయన్-కాచెట, నోహ్ క్రోస్ చెలరేగి ఆడటంతో ఒకానొక దశలో భారత డౌగౌట్?లో కొంచెం ఆందోళన నెలకొంది. కానీ చివరకు టీమిండియా 17 పరుగుల తేడాతో గెలుపొందింది. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 3 వికెట్లు తీయగా.. శివమ్ దూబే రెండు వికెట్లు సాధించాడు. బుమ్రా ఒక వికెట్ పడగొట్టాడు.

# ఎదురులేని దక్షిణాఫ్రికా..

## యూఏఈపై ఘనవిజయం

## మెరిసిన బోష్, నోకియా




ఢిల్లీ: టీ20 ప్రపంచకప్‌లో లీగ్ దశను దక్షిణాఫ్రికా అజేయంగా ముగించింది. సూపర్-8కు ముంగిట ఆ జట్టు అదిరే విజయాన్ని అందుకుంది. బుధవారం గ్రూప్-డి మ్యాచ్‌లో మార్‌క్రమ్ సేన 6 వికెట్ల తేడాతో యూఏఈని ఓడించింది. పేసర్లు కార్బిన్ బోష్ (3/12), నోకియా (2/28) విజృంభించడంతో మొదట యూఏఈ 20 ఓవర్లలో 122/6కే పరిమితమైంది. అలీషన్ షరాఫు (45; 38 బంతుల్లో 5ఐ4, 1ఐ6), కెప్టెన్ మహ్మద్ వసీమ్ (22; 12 బంతుల్లో 4ఐ4) చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. ఛేదనలో డెవాల్డ్ బ్రెవిస్ (36; 25 బంతుల్లో 1ఐ4, 3ఐ6), రికెల్టన్ (30; 16 బంతుల్లో 3ఐ4, 2ఐ6), మార్‌క్రమ్ (28; 11 బంతుల్లో 5ఐ4, 1ఐ6) మెరుపులతో దక్షిణాఫ్రికా 13.2 ఓవర్లలోనే 4 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఇప్పటికే సూపర్-8 చేరిన సఫారీ జట్టు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలవగా.. యూఏఈ ఒకే విజయం (కెనడాపై)తో టోర్నీని ముగించింది. ఈ గ్రూప్‌లో న్యూజిలాండ్ (6) ఇప్పటికే సూపర్-8 చేరింది. నామమాత్రపు పోరు కావడం, భారత్‌తో ఆదివారం సూపర్-8 మ్యాచ్ ఉండడంతో లుంగి ఎంగిడి, మార్కో యాన్సెన్‌లకు బుధవారం దక్షిణాఫ్రికా విశ్రాంతి ఇచ్చింది. నోకియాను టోర్నీలో తొలిసారి ఆడించింది.మెరిసిన బ్రెవిస్, రికెల్టన్: మొదట యూఏఈ పరుగుల కోసం కష్టపడిన పిచ్‌పై ఛేదనలో దక్షిణాఫ్రికా అదరగొట్టింది. ఓపెనర్లు మార్‌క్రమ్, డికాక్ (14) 2.5 ఓవర్లలో 32 పరుగులు జోడించి శుభారంభం అందించారు. ముఖ్యంగా ఉన్నంతసేపు మార్‌క్రమ్ చెలరేగాడు. హైదర్ అలీ వేసిన మూడో ఓవర్లో అతడు 3 ఫోర్లు, ఓ సిక్స్ బాదాడు. అదే ఓవర్లో చివరి బంతికి అతడు ఔటయ్యాడు. కొన్ని షాట్లు ఆడిన డికాక్ సైతం మరో ఓవర్ తర్వాత మార్‌క్రమ్‌ను అనుసరించాడు. ఈ స్థితిలో బ్రెవిస్, రికెల్టన్ స్కోరు తగ్గకుండా చూశారు. 8వ ఓవర్లో బ్రెవిస్ ఓ సిక్స్, ఫోర్ కొట్టగా... 10వ ఓవర్లో రికెల్టన్ రెండు సిక్స్‌లు బాదాడు. సఫారీ జట్టు విజయానికి చేరువైన స్థితిలో రికెల్టన్, బ్రెవిస్ స్వల్ప వ్యవధిలో వెనుదిరిగినా.. స్టబ్స్ (6 నాటౌట్), జేసన్ స్మిత్ (3 నాటౌట్) పని పూర్తి చేశారు. అంతకుముందు యూఏఈ బ్యాటర్లకు సఫారీ పేసర్లు బోష్, నోకియా కళ్లెం వేశారు. యూఏఈ ఇన్నింగ్స్‌ను కాస్త మెరుగ్గానే ఆరంభించింది. 4.2 ఓవర్లకు 38/0తో నిలిచింది. అయితే ఓవర్ తేడాతో ఓపెనర్లు మహ్మద్ వసీం, ఆర్యాంశ్ (13) వికెట్లను కోల్పోయిన యూఏఈ ఇబ్బందుల్లో పడింది. ఒకవైపు అలీషన్ షరాఫు నిలిచినా.. అతడికి మద్దతు ఇచ్చేవాళ్లు లేకపోయారు. బోష్, నోకియాతో పాటు లిండ్ కట్టుదిట్టంగా బంతులు వేయడంతో యూఏఈ బ్యాటర్లు బ్యాట్ ఝుళిపించలేకపోయారు.

# మహేష్ బిజినెస్ స్కెచ్ అదుర్స్!



మల్టీప్లెక్స్ చైన్‌ని విస్తరిస్తున్న సూపర్‌స్టార్ మహేష్ బిజినెస్ స్కెచ్ అదుర్స్ అంటున్నారు ఫ్యాన్స్. ఓ పక్క సినిమాలు చేస్తూనే మరో పక్క మల్టీప్లెక్స్ బిజినెస్‌ని మహేష్ పరుగులు పెట్టిస్తున్నారు. ఏషియన్ ఫిలింస్ అధినేత సునీల్ నారంగ్‌తో కలిసి ఏఎంబీ బ్రాండ్‌ని క్రియేట్ చేసిన ఆయన దీనిని దేశ వ్యాప్తంగా విస్తరించే ప్లాన్‌ని అమలు చేసే పనిలో ఉన్నాడు. స్టార్ హీరోలు అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, రవితేజ ఒక్కో మల్టీప్లెక్స్ థియేటర్లతో సరిపెట్టుకుంటే మహేస్ మాత్రం భారీ చైన్ సిస్టమ్‌ని క్రియేట్ చేయబోతున్నాడు.ం

తొలి ప్రయత్నంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏరియాలో ఏఎంబీ సినిమాలు పేరుతో తొలి మల్టీప్లెక్స్‌ని ప్రారంభించారు. ప్రస్తుతం అది ఐటీ కారిడార్‌కు అత్యంత సమీపంలో ఉండటం, లగ్జరీ జనావాసాల మధ్య ఉండటంతో దీనికి ప్రేక్షకుల తాకిడి విపరీతంగా ఉంటోంది.

ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఇక్కడ పలు బ్రాండ్‌లకు సంబంధించిన రెస్టారెంట్స్, క్లాతింగ్ షోరూమ్స్ వంటి వివిధ మినీ షోరూమ్స్ ఉండటంతో వీకెండ్స్‌లో ప్రేక్షకులు అధిక సంఖ్యలో ఇక్కడికి విచ్చేస్తున్నారు. దీంతో సిటీలో మరిన్ని మల్టీప్లెక్స్‌లకు శ్రీకారం చుట్టాలని ప్లాన్ చేసిన మహేష్ ఇప్పటికే హకీంపేట్, ,ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లలో రెండు థియేటర్లని మొదలు పెట్టాడు. ప్రస్తుతం కన్‌స్ట్రక్షన్ దశలో ఉన్న ఈ మల్టీప్లెక్స్ థీయేటర్స్ త్వరలోనే ప్రారంభం కానున్నాయి. సిటీలో మరిన్ని మల్టీప్లెక్స్‌లని సునీల్ నారంగ్‌తో కలిసి ప్లాన్ చేస్తున్న మహేష్ బెంగళూరులోనూ కపాలి థియేటర్ ప్రాంగణంలో ఏఎంబీ సినిమాస్ కపాలి థియేటర్ ని జనవరి 16న లాంఛనంగా ప్రారంభించిన విషం తెలిసిందే. ఇదే తరమాలో చెన్నైలోనూ భారీ స్థాయిలో మల్టీప్లెక్స్‌లకు శ్రీకారం చుట్టబోతున్నారట. దానితో పాటు గోవాకు కూడా తన మల్టీప్లెక్స్ థియేటర్ల చైన్‌ని విస్తరించే పనిలో ఉన్నట్టుగా టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. 3డీ స్క్రీన్స్, డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టమ్‌తో పాటు ఐమ్యాక్స్ టెక్నాలజీ థియేటర్లని కూడా అందుబాటులోకి తీసుకురానున్నారట. ఇదిలా ఉంటే మహేష్ ప్రస్తుతం జక్కన్న అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ -వారణాసి-లో నటిస్తున్నాడు. దీనికి సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. మరో ఏడు నెలలు పూర్తయితే షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. మిగిలిందిక వీఎఫ్ఎక్స్ వర్క్.. దానికి ఎక్కువ టైమ్ పడుతుంది కాబట్టి ఈ భారీ పాన్ వరల్డ్ మూవీని 2027లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టుగా టీమ్ ప్రకటించింది. అయితే సినిమా రిలీజ్ వాయిదా పడే అవకాశం ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో టీమ్ క్లారిటీ ఇచ్చింది. 2027లో పక్కాగా వస్తామని ఫుల్ క్లారిటీ ఇచ్చేసింది. అయితే మార్చిలో వచ్చే అవకాశాలు ఉన్నాయని కొంత మంది అంటుంటే ఏప్రిల్ ఫస్ట్ వీక్‌లో వచ్చే అవకాశాలు ఉన్నాయని మరికొంత మంది అంటున్నారు.



కావ్య థాపర్ టాలీవుడ్ & కోలీవుడ్ గ్లామర్ క్వీన్

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com